# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :320 బుధవారం 22-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/







## సింధు జలాల ఒప్పందం
# పునరుద్ధరణ కుదరదు

- ఉగ్రవాదాన్ని అంతం చేసేదాకా ఇంతే
- ఈ విషయంలో మా వైఖరి మారబోదు
- పాకిస్తాన్‌కు తెగేసి చెప్పిన భారత్

సరిహద్దు ఉగ్రవాదంపై రాజీకి తావులేదని మరోసారి స్పష్టం చేసిన భారత్.. ఉగ్రవాదానికి పాకిస్తాన్ పూర్తిగా స్వస్తి పలికే వరకు సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. జాతీయ భద్రతకు విఘాతం కలిగించే పరిస్థితుల్లో ఒప్పందాల కంటే దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది.



2




## రైతులను తప్పుదోవ
# పట్టించొద్దు

- హరీశ్‌రావుకు ఉత్తమ్ కౌంటర్
- దేవాదులపై దుష్ప్రచారం మానాలి
- కాళేశ్వరం నిర్ణయాలపై జవాబు చెప్పాలి
- మేడిగడ్డ డిజైన్ మార్పుపై ప్రశ్నలు
- దేవాదుల పంపులు నేటి నుంచే పూర్తి సామర్థ్యంతో

హైదరాబాద్ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ)
మాజీ మంత్రి హరీశ్‌రావు రైతులను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకోవాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హితవు పలికారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టుపై దుష్ప్రచారం మాని, కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో మొదట రూపొందించిన షీట్ పైల్ ఫౌండేషన్ డిజైన్‌ను మార్చి సెకెంట్ పైల్ ఫౌండేషన్‌ను ఎందుకు చేర్చారో చెప్పాలంటూ నిలదీశారు. కాళేశ్వరం కాంట్రాక్టర్లు బీఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు చెల్లించారని కవిత చేసిన ఆరోపణలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేవాదుల ఎత్తిపోతల పథకం కింద

-మిగతా 2 లో




# ఉద్యోగాల గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం

- మేడిగడ్డను కుంగకొట్టి కరువంటున్న హరీశ్‌రావు
- పదేండ్ల అరాచకం, రెండున్నరేండ్ల ప్రజాపాలనపై చర్చకు సిద్ధం
- విద్యార్థులపై లాఠీచార్జి మోడీ నియంతపాలనకు నిదర్శనం
- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ)
'నీళ్లు, నిధులు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. పదేండ్ల పాటు అరాచక పాలన సాగించారు. కాళేశ్వరం పేరిట ప్రజలకు ఎన్నో కలలు చూపించి లక్ష కోట్ల నిధులు గోదావరి పాలు చేశారు. తాపీ, ఇంజినీర్, మేస్త్రీ.. నేనే అని కేసీఆర్ అంటూ లోపభూయిష్ట ప్లాన్‌తో కాళేశ్వరాన్ని ముంచారు. మేడిగడ్డ కుంగడంలో హరీశ్‌రావు బాధ్యత లేదా..? ఉద్యోగాల పేరిట కేటీఆర్ దొంగ ఏడుపు ఏడుస్తున్నాడు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో, రెండున్నరేండ్ల కాంగ్రెస్ హయాంలో కల్పించిన ఉద్యోగాలు, అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?' అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల కోసం కేటీఆర్ మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుతున్నారని, కుటుంబం నిండా ఉద్యోగాలు కల్పించుకున్నారని

-మిగతా 2 లో

## ప్రధాని నివాసం ఎదుట కాంగ్రెస్
# మెరుపు ధర్నా

### చేతులకు తాళ్లు కట్టుకుని నిరసన తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు

- మూడు గంటల పాటు కొనసాగిన ధర్నా
- కాంగ్రెస్ కార్యకర్తలపై లాఠీఛార్జికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్
- పార్లమెంట్ భవనం నుంచి మోడీ ఇంటి వద్దకు పాదయాత్రగా వెళ్లిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక
- ధర్నాలో పాల్గొన్న కర్ణాటక సీఎం డికె శివకుమార్, కేరళ సీఎం సతీశన్
- ధర్నా వద్దకు వచ్చి రాహుల్‌తో చర్చించిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్
- ఆందోళన విరమించాలని అభ్యర్థన
- మోడీ దిగివచ్చే వరకు ధర్నా విరమించేది లేదని కాంగ్రెస్ స్పష్టీకరణ
- రాహుల్, ప్రియాంక సహా కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు
- తోపులాటలో రాహుల్‌కు స్వల్ప గాయాలు, ముక్కు నుంచి రక్తం
- వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలింపు సోనియా పరామర్శ
- రాహుల్, ప్రియాంక అరెస్టులను ఖండించిన సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ)
నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు స్పందించిన తీరును ఖండిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం ప్రధాని నివాసం ఎదుట ధర్నాకు దిగారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఆ పార్టీ ఎంపీలు, నేతలు నివాసానికి ఊడారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, పార్లమెంట్‌లో చర్చించాలనే డిమాండ్లతో కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. ఇది సుమారు మూడు గంటలపాటు కొనసాగింది. చేతులు, కాళ్లకు ప్లాస్టర్లు కట్టుకుని నిరసనలో


-మిగతా 2 లో





# అమెజాన్ డాటా సెంటర్‌పై ఇరాన్ దాడి


- గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడ్డ టెహ్రాన్
- ఇరాన్‌పై 10వ రోజూ కొనసాగిన అమెరికా మిలిటరీ దాడులు



2

# హస్తం వెనుక కమలం!

- అందుకే పిఎం ఇంటి వరకు రాగలిగారు
- సిజేపి ఉద్యమాన్ని పక్కదోవ పట్టించే కుట్ర
- కాంగ్రెస్ పార్టీపై ఆప్ విమర్శలు
- విద్యార్థులపై కేంద్రం బ్రిటీషర్కంటే క్రూరత్వం చూపిస్తోంది.. ఆప్ ధ్వజం
- గాయపడిన విద్యార్థులను పరామర్శించిన కేజ్రీవాల్



2

# నీట్‌పై దద్దరిల్లిన పార్లమెంట్

- చర్చకు పట్టుపట్టిన విపక్షాలు
- ఉభయ సభల్లో గందరగోళం



2

## అమర్‌నాథ్ యాత్ర
# తాత్కాలిక నిలిపివేత



2

## పిల్లలను
# రెచ్చగొట్టవద్దు



### నీట్ పేపర్ లీక్ ఘోర పాపం

- బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం
- లీకులను నివారించడం జాతీయ బాధ్యత
- ఇది రాజకీయాలకు సంబంధించిన అంశం కాదు
- 'నీట్' పేపర్ లీక్‌పై వెంటనే స్పందించి 13 మందిని అరెస్ట్ చేశాం
- 'మంగళ్ మిలన్' సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ- 21 జూలై (జర్నలిస్ట్ డైరీ)
నీట్ అవకతవకల వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ ఘోర పాపమని అన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, తద్వారా యువత భవిష్యత్తుతో ఎవరూ చెలగాటమాడకుండా చూస్తామని తెలిపారు. ఇలాంటి లీకులను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. ఇది పార్టీ రాజకీయాలకు సంబంధించిన అంశం కాదన్నారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశమైనందున అన్ని

-మిగతా 2 లో

## ఎడ్యుకేషన్
# హబ్‌గా కొడంగల్

### నెలలో ఒకరోజు సైట్‌కి వస్తా.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- భూ సేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల అదనపు పంపులను పూర్తి చేయాలి : సీఎం రేవంత్ రెడ్డి
- నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష
- పనులు వేగవంతం చేయాలని ఆదేశం

కొడంగల్ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ)
కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుందనీ, నియోజకవర్గంలోని ప్రతి ప్రాజెక్టుపై నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడూ తనకు తెలియజేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక నుంచి నెలలో ఒకరోజు సైట్‌లో ఉండి.. పనులపై సమీక్షిస్తానని స్పష్టం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేట్‌లోని ఎడ్యుకేషన్ హబ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో ఇంజినీరింగ్ కాలేజీ, హాస్టల్ నిర్మాణ పనులు, వెటర్నరీ కాలేజీ, ప్రభుత్వ మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరఫీ, పారా మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



-మిగతా 2 లో

# సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణ కుదరదు

- ఉగ్రవాదాన్ని అంతం చేసేదాకా ఇంతే
- ఈ విషయంలో మా వైఖరి మారబోదు
- పాకిస్తాన్‌కు తెగేసి చెప్పిన భారత్



న్యూఢిల్లీ:
సరిహద్దు ఉగ్రవాదాన్ని అంతం చేసేవరకు పాకిస్తాన్‌తో సింధు నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించేది లేదని విదేశాంగశాఖ తెగేసిచెప్పింది. పహల్గాం మార్పణ హోమం తర్వాత సింధు నదీ నీటిని అడ్డుకోవడంతో తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ విషయంలో భారత్‌పై అనేక రకాలుగా ఒత్తిడి తెచ్చేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నిస్తోంది. విమర్శలు, బెదిరింపులకు దిగుతోంది. అయినా సరే ఈ విషయంలో మరో మాటేలేదని భారత్ స్పష్టంచేస్తోంది.

ప్రస్తుత స్థితిలో సింధు నదీ జలాల ఒప్పందాన్ని కొనసాగించడం సాధ్యం కాదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు పాకిస్తాన్ తగిన చర్యలు తీసుకోనంత వరకు ఈ ఒప్పందం కొనసాగబోదని తెలిపాయి. తీవ్రవాదానికి మద్దతు ఇచ్చే చర్యలకు పాకిస్తాన్ స్వస్తి పలకాలని, ఈ విషయంలో పాక్ తగిన చర్యలు తీసుకున్న తర్వాత మాత్రమే సింధు నదీ జలాల ఒప్పందాన్ని పాటిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. అది కూడా చర్చల అనంతరమే అని స్పష్టం చేసినట్లు ఒక జాతీయ మీడియా పేర్కొంది.

ఇదే సమయంలో పాకిస్తాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయాలనుకోవడం లేదని, తాత్కాలికంగా మాత్రమే ఒప్పందాన్ని నిలిపివేశామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒక అంతర్జాతీయ ఒప్పందం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉందనిపిస్తే దాన్ని రద్దు చేసే హక్కు సార్వభౌమ దేశంగా ఇండియాకు ఉందని కేంద్రం అభిప్రాయపడింది. ఈ ఒప్పందం నిలిపివేత విషయంలో ఇండియాపై పాక్ దుష్ప్రచారం చేస్తోంది. తమ దేశంలో నీటి కొరతకు ఇండియానే కారణమని పాక్ ఆరోపిస్తోంది. నీటిని నిల్వ చేసుకుని వాడుకునే సామర్థ్యం లేకపోవడం వల్లే ఆ దేశంలో ఈ పరిస్థితి తలెత్తిందని ఇండియా బదులిచ్చింది. అక్కడ నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం, లీకేజీలు, ఇతర ప్రాంతాల మధ్య ఉన్న వివాదాల కారణంగానే పాక్‌లో నీటి కొరత ఉందని ఇండియా అంటోంది.

## ఉద్యోగాల గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం

(మొదటి తరువాయి)

ఆరోపించారు. వారి హయాంలో 30-35 వేల ఉద్యోగాలిస్తే.. తమ హయాంలో 70 వేల వరకు ఉద్యోగాలు కల్పించినట్టు తెలిపారు. ఇప్పుడు బావబామ్మర్దులు బజార్లపడి అబద్దాలు మాట్లాడుతున్నారని.. కానీ ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.


## రైతులను తప్పుదోవ పట్టించొద్దు

(మొదటి తరువాయి)

మంగళవారం నుంచే 9 పంపింగ్ యూనిట్లు 24 గంటల పాటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తాయని తెలిపారు. గోదావరి నుంచి వీలైనంత ఎక్కువ నీటిని ఎత్తిపోసి, దేవాదుల పరిధిలోని 9 జిల్లాలకు చెందిన 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు పంపులను గరిష్ట సామర్థ్యంతో నడపాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

# అమెజాన్ డాటా సెంటర్‌పై ఇరాన్ దాడి

గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడ్డ టెహ్రాన్
ఇరాన్‌పై 10వ రోజూ కొనసాగిన అమెరికా మిలిటరీ దాడులు



టెహ్రాన్,
అమెరికా జరిపిన దాడులకు ఇరాన్ ప్రతీకార దాడులకు పూనుకుంది. కువైట్, బహ్రెయిన్‌లోని సైనిక లక్ష్యాలపై మంగళవారం డ్రోన్, క్షిపణులతో విరుచుకుపడింది. ముఖ్యంగా బహ్రెయిన్‌లోని అమెజాన్ డాటా సెంటర్‌పై తీవ్రంగా దాడి చేసింది. పలు క్షిపణులతో దాడి చేయడంతో డాటా సెంటర్ ధ్వంసం అయినట్టు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది. అమెరికాకు చెందిన అమెజాన్ కంపెనీ డాటా మౌలిక సదుపాయాలు లక్ష్యంగా దాడులు చేసినట్టు తెలిపింది. అలాగే ఆ దేశంలోని ముహార్రక్, రిఫా ప్రాంతాల్లోని రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు వివరించింది.కువైట్‌లోని అమెరికా వాయు రక్షణ వ్యవస్థలు, ఇతర మిలిటరీ స్థావరాలపై దాడులు చేసినట్టు ఐఆర్‌జీసీ తెలిపింది. ఇరాన్‌లో పలు చోట్ల వరుసగా 10వ రోజు రాత్రి అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా తాము ప్రతిదాడులు చేసినట్టు పేర్కొంది. 'శత్రువులు మరింత నిర్ణయాత్మకమైన డ్రోన్, క్షిపణి దాడుల పరంపరను ఎదుర్కోడానికి సిద్ధం కావాలి' అని ఐఆర్‌జీసీ హెచ్చరించినట్టు ఐఆర్ఎన్ఏ తెలిపింది. కాగా, తమ దేశంలోని పలు విద్యుత్, నీటి శుద్ధి ప్లాంట్లపై ఇరాన్ సోమవారం దాడులు చేయడంతో మంటలు చెలరేగినట్టు కువైట్ ప్రకటించింది. కాగా, హెర్ముజ్‌ను తిరిగి తెరిపించేందుకు ఒత్తిడి తేవడానికి వరుసగా 10వ రోజు కూడా దాడులు తీవ్రంగా కొనసాగినట్టు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) తెలిపింది. కాగా, అమెరికా స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ జరుపుతున్న దాడుల్లో ఇంతవరకు 17 మంది అమెరికా సైనికులు మృతి చెందారు. కాగా, తమ సైనికుల మృతి పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇరాన్ అమెరికా సైనికులను హతమారుస్తున్నది. వారు పాల్పడ్డ మరణాలకు అనేక రెట్లు ప్రతీకారం చెల్లించుకోవాల్సి ఉంటుంది' అని హెచ్చరించారు.

## అమర్‌నాథ్ యాత్ర తాత్కాలిక నిలిపివేత



శ్రీనగర్
జమ్ముకశ్మీర్‌లో ఆదివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన వివిధ ప్రమాదాల్లో మరణించినవారి సంఖ్య 28కి చేరింది. ప్రతికూల వాతావరణం కారణంగా అమర్‌నాథ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో వేలాదిమంది యాత్రికులు వివిధ క్యాంపుల్లోనే చిక్కుకుపోయారు. పహల్గామ్, బాల్తాల్ మార్గాల గుండా యాత్రికులు వెళ్లేందుకు అధికారులు అనుమతించడం లేదు. ఈ ఏడాది యాత్ర ప్రారంభమైన మొదటి రెండు వారాల్లోనే 3.8 లక్షల మందికిపైగా భక్తులు గుహాలయాన్ని దర్శించుకున్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇది ఆకస్మిక వరదలకు దారితీసి, ప్రయాణాలకు అంతరాయం కలిగించవచ్చని భారత వాతావరణశాఖ(ఐఎండీ) హెచ్చరించింది.

# ప్రధాని నివాసం ఎదుట కాంగ్రెస్ మెరుపు ధర్నా

(మొదటి తరువాయి)

పాల్గొన్నారు. అనంతరం రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీ సహా ముఖ్య నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుండి తరలించారు. ఈ క్రమంలో రాహుల్‌గాంధీ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. పోలీసులు ఆయనను తరలించే క్రమంలో ముక్కు నుంచి రక్తం వచ్చినట్లు తెలుస్తోంది. లోక్ కల్యాణ్ మార్గ్‌లో సుమారు 20 నిమిషాల పాటు కొనసాగిన ఈ ధర్నా సందర్భంగా ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి అక్కడికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. ధర్నాను విరమించాలని ఆయన కోరినప్పటికీ చర్చలు ఫలించలేదని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేసే వరకు రాత్రంతా అక్కడే ధర్నా కొనసాగిస్తామని ప్రకటించారు. టీడీపీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాదా ముందుగా పోలీసు చర్యల్లో గాయపడిన విద్యార్థులను ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, దేవేగౌడ, ముఖ్యమంత్రి పి.డి. సతీశన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ప్రధాని నివాసం వైపు రయ్‌మని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజల స్వేచ్ఛపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోందని ఆరోపిస్తూ, నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీలు, నేతల ప్రతీకాత్మకంగా తమ చేతులకు కట్లు కట్టుకున్నారు. విద్యార్థులపై దాడి అంటే దేశంలోని ప్రతి కుటుంబంపై దాడి చేసినట్లేనని రాహుల్ గాంధీ అన్నారు. సమాధానాలు చెప్పకుండా, బాధ్యత నుండి తప్పించుకోవచ్చని ప్రధాని మోడీ భావిస్తున్నారని, ఈసారి అది సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు న్యాయం జరగాలని కోరుకునే ప్రతి దేశభక్తుడు ప్రధాని నివాసం ఎదుట జరుగుతున్న ధర్నాలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. భారత విద్యార్థుల గొంతును ఎవరూ అణచివేయలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లను అంగీకరించి న్యాయం చేసే వరకు ధర్నా విరమించేదిలేదని కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా తెలిపారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ధర్నా స్థలం నుండి తమను తొలగించే ప్రయత్నంలో పోలీసులు బలప్రయోగానికి పాల్పడ్డారని కొందరు కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. మాజీ పంజాబ్ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ, లోక్‌సభలో కాంగ్రెస్ చీఫ్ విప్ కె. సురేష్, ఎంపీ సుఖ్‌జిందర్ రంధావాను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుండి తరలించారు. కొద్ది గంటల తర్వాత భట్టీ అక్కడి నుండి వెళ్లిపోయారు. విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం లేదని చరణ్‌జిత్ సింగ్ చన్నీ ఆరోపించారు. ఇది గుండా యిజం, అధికార దుర్వినియోగానికి నిదర్శనమని మండిపడ్డారు. ఎంపీలక్ ఈ పరిస్థితి ఉంటే, విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని సుఖ్‌జిందర్ రంధావా వ్యాఖ్యానించారు. తమను పోలీసులు అత్యంత దారుణంగా అదుపులోకి తీసుకున్నారని కె. సురేష్ ఆరోపించారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో పార్లమెంట్ వద్ద నిర్వహించిన నిరసన ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతలు ప్రధాని నివాసం వద్ద సామూహిక నిరసనకు పిలుపునిచ్చారని విలేకరుల సమావేశంలో ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిందుకే ఆయన నివాసానికి వచ్చామని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ అంశంపై బాధ్యత వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని, పార్లమెంట్ లో చర్చకూ అవకాశం ఇవ్వడం లేదని ఆయన ఎక్స్ లో పేర్కొన్నారు. దేశ యువత భవిష్యత్తును నాశనం చేసినందుకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి షా రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులకు, వారి న్యాయమైన డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులపై లాఠీచార్జ్, బలప్రయోగంపై నిరంకుశత్వ ధోరణి అవలంబించిన ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని భట్టీ పేర్కొన్నారు. దేశ యువతకు అన్యాయం చేసిన మోడీ, అమిత్ షా రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, సోమవారం జరిగిన పోలీసు చర్యలో గాయపడిన కొందరు విద్యార్థులను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో పరామర్శించారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా డిమాండ్ చేశారు.

# నీట్‌పై దద్దరిల్లిన పార్లమెంట్



న్యూఢిల్లీ:
నీట్ పేపర్ లీకేజీపై పార్లమెంట్ దద్దరిల్లింది. ఈ అంశంపై తక్షణమే చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు మంగళవారం తీవ్ర నిరసనలు తెలపడంతో వరుసగా రెండవరోజు లోక్‌సభ కార్యకలాపాలకు పదేపదే అంతరాయం ఏర్పడి చివరకు సభ వాయిదా పడింది. సభలో హుందాతనాన్ని పాటించి సమావేశం సజావుగా సాగేలా చూడాలని స్పీకర్ నుంచి పలుమార్లు విజ్ఞప్తులు వచ్చినప్పటికీ విపక్ష సభ్యుల నినాదాలతో సభలో గందరగోళం ఏర్పడి లోక్‌సభ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్, పాలనాపరమైన వైఫల్యాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విపక్ష సభ్యులు ఢిల్లీలో నిరసన తెలియచేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యను ఖండిస్తూ పరీక్ష భద్రత, సంస్కరణలపై వెంటనే పూర్తి స్థాయి చర్చ జరగాలని డిమాండ్ చేశారు. దేశంలోని యువత పట్ల వ్యవహరించే విధానం ఇది కాదు.దేశంలోని యువతకు అవకాశాలు లేవు. అన్ని దారులు మూసుకుపోయాయి. పోటీ పరీక్షల రూపంలో ఉన్న ఏకైక మార్గం కూడా నాశనం చేశారు. ఇక్కడ ఉన్న విద్యార్థులు కేవలం విద్యా విధానం గురించే కాకుండా తమ భవిష్యత్తు గురించి కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అని విపక్ష సభ్యులు తెలిపారు. అంతకుముందు అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సంబంధించిన విరాళాల చోరీ, ఆర్థిక అవకతవకలపై వచ్చిన ఆరోపణలను ప్రతిపక్ష ఎంపీలు సభలో ప్రస్తావించారు. ఈ విషయంపై పారదర్శక పార్లమెంటరీ పరిశీలన జరగాలని వారు డిమాండ్ చేశారు.

# ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్

(మొదటి తరువాయి)


అనంతరం అభివృద్ధి పనులపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో అలసత్వం వహించొద్దని అధికారులకు సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినా, తప్పుడు సమాచారం ఇచ్చినా సస్పెన్షన్‌కు వెనకాడొద్దన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యంపై సీఎం మండిపడ్డారు. వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్దిదారులకు అందజేయాలని ఆదేశించారు. మక్తల్ -నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి అదనపు పంపుల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నింటినీ వర్క్ ఆర్డర్ ఇచ్చి పూర్తి చేయాలన్నారు. భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సెప్టెంబర్‌లోగా భూసేకరణ పూర్తి చేయాలని తెలిపారు. అవసరమైతే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి భూ సేకరణ పూర్తి చేయాలని చెప్పారు. మూడవ పంపు ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నీ జరిగాయా లేదో క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఫేజ్ -1 పనులు డిసెంబర్ వరకు పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు సీఎంకి తెలపగా.. డిసెంబర్ 2027 వరకు ప్రతినెలా ఎంత మేర పనులు పూర్తి చేయగలుగుతారో సంతకాలతో సహా వివరాలు సమర్పించాలని అన్నారు.

**ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో సమన్వయంతో పనిచేయాలి**

రంగారెడ్డి- వికారాబాద్- నారాయణపేట ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్చించి డిజైన్లు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రోడ్‌కు సంబంధించిన భూసేకరణ సెప్టెంబర్ 2026 లోగా పూర్తి చేస్తామని కలెక్టర్లు తెలిపారు. భూసేకరణ పూర్తయిన వెంటనే టెండర్ ప్రాసెస్ మొదలు పెట్టాలని అన్నారు. భూసేకరణలో భాగంగా రైతులను ఒప్పించి కాన్సెంట్ అవార్డుకు వెళితే రైతులకు ఎక్కువగా నిధులు వచ్చే అవకాశంపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఈ విషయంపై సమన్వయం చేయాలని సీఎం ఆదేశించారు. ఆగస్టు 15, 2028 లోగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టనున్న మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్కులపైనా సమీక్ష నిర్వహించారు. దుద్యాల ఇండస్ట్రియల్ పార్కు గురించి అధికారులతో చర్చించారు. ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన భూసేకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణంలో టీజీఐఐసీ చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు. భూసేకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే , అక్టోబర్‌లో పనితీరు ఆధారంగా అవసరమైతే కలెక్టర్లను బదిలీ చేస్తామని హెచ్చరించారు.

# హస్తం వెనుక కమలం!

- అందుకే పిఎం ఇంటి వరకు రాగలిగారు
- సిజేపి ఉద్యమాన్ని పక్కదోవ పట్టించే కుట్ర
- కాంగ్రెస్ పార్టీపై ఆప్ విమర్శలు
- విద్యార్థులపై కేంద్రం బ్రిటీషర్లకంటే క్రూరత్వం చూపిస్తోంది.. ఆప్ ధ్వజం
- గాయపడిన విద్యార్థులను పరామర్శించిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ,
కేంద్రంపై పోరాటం రాజకీయ రంగు పులుముకుంటోంది. విద్యార్థుల ధర్నాపై ప్రధాన పార్టీల మధ్య వైరం బహిరంగం అవుతోంది. నీట్ అక్రమాలు, విద్యార్థులపై లాఠీఛార్జ్ కి నిరసనగా రాహుల్ గాంధీ చేపట్టిన ఆందోళన రాజకీయ దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో కాంగ్రెస్, ఆప్, బీజేపీ మధ్య ఆరోపణలు, సవాళ్లు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాని మోడీ నివాసం ఎదుట విపక్ష నేత రాహుల్ చేపట్టిన చేతుల సంకెళ్ల ధర్నాపై ఆప్ విరుచుకుపడింది. ధర్నా వెనుక బీజేపీ హస్తం ఉందని సంజయ్ సింగ్ ఆరోపించారు. సీజేపీఆధ్వర్యంలో జరుగుతున్న నిజమైన విద్యార్థి ఉద్యమాన్ని పక్కదోవ పట్టించే దుకే కాంగ్రెస్ పార్టీ ఈ నాటకానికి తెరతీసిందని విమర్శించారు.

దేశ బిడ్డలపై హింసకు పాల్పడటమా?: కేజ్రీవాల్

కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీపై ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. విద్యార్థుల పోరాటాన్ని లాఠీ ఛార్జ్ తో అణచాలని చూస్తున్నారని మండిపడ్డారు. మోడీ పాలన బ్రిటీషర్లను తలపిస్తోందన్నారు. విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయం అన్నారు. సీజేపీ పార్లమెంట్ మార్చ్ సందర్భంగా గాయపడిన విద్యార్థులను కేజ్రీవాల్ మంగళవారం పరామర్శించారు. గాయపడిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. విద్యార్థులపై ఎన్ని ఎఫ్ఐఆర్లు నమోదు చేశారో, ఎంతమంది విద్యార్థులను నిర్బంధించారో తెలుసుకుంటామని, వారికి సహాయం చేస్తామన్నారు. మన సొంత పిల్లలాంటి దేశ యువతపై మోడీ ప్రభుత్వం చేసినంత హింసను బ్రిటీష్ వారు కూడా స్వాతంత్ర్య సమరయోధులపై ప్రయోగించలేదని అన్నారు.

# పిల్లలను రెచ్చగొట్టవద్దు

(మొదటి తరువాయి)



రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో కలిసి పనిచేయాలని కోరారు. మంగళ్ మిలన్ పేరిట మంగళవారంనాడిక్కడ జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ మేరకు ప్రధాని మోడీ మాట్లాడారు. ఆ వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మీడియా సమావేశంలో తెలిపారు. నీట్ పేపర్ లీక్ అంశం వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టేందని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 13 మందిని జైలుకు పంపామని చెప్పారు. ఇదే సమయంలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీట్ పునఃపరీక్ష నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చామని, ఫలితాలను కూడా ఆలస్యం లేకుండా ప్రకటించనున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో పేపర్ లీక్స్ జరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రధాని సూచించారని తెలిపారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా దేశంలోని ప్రముఖ న్యాయవాదులను నియమించాలని కూడా ప్రధాని సూచించినట్లు చెప్పారు.ఈ అంశంపై ఎంపీలంతా ప్రజల ముందుకు వెళ్లి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించి వారికి మరింత చేరువకావాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరుగనీయమని, దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపైనా ఉందని ప్రధాని సూచించారు. పిల్లలను రెచ్చగొట్టవద్దని, తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభమే కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం కష్టమని, వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మన అందరి బాధ్యత అని ప్రధాని పేర్కొన్నారు. ఎన్డీయే సమావేశంలో దేశ ఆర్థిక పురోగతి, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, ప్రభుత్వ విజయాలపై ప్రధాని సమీక్షించినట్లు రిజిజు చెప్పారు. వాణిజ్య ఒప్పందాల్లో రైతుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రధాని హామీ ఇచ్చారని తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# అండర్-15 పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్..

- ఫ్రాన్స్ పార్లమెంట్‌లో బిల్లు




**న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** 15 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ చేయాలని ఫ్రాన్స్ భావిస్తున్నది. దీని కోసం బిల్లును రూపొందించారు. ఆ బిల్లును ఇవాళ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. మంగళవారం ఆ బిల్లుపై చర్చ జరగనున్నది. సోషల్ మీడియా వినియోగంపై పిల్లల కోసం ప్రత్యేక ఆంక్షలు కూడా విధించే రీతిలో కొత్త బిల్లును రూపొందించారు. అయితే యురోపియన్ యూనియన్ చట్టాల ప్రకారం ఆ బిల్లును తయారీ చేసినట్లు ఫ్రాన్స్ చెబుతోంది. సెప్టెంబర్‌లో కొత్త వార్షిక సంవత్సరం ప్రారంభంకానున్న నేపథ్యంలో సోషల్ మీడియా బ్యాన్ అంశంలో ఫ్రాన్స్ పార్లమెంట్ ఆగమేఘాల మీద చట్టాన్ని రూపొందించే ప్రయత్నం చేస్తున్నది. నేషనల్ అసెంబ్లీతో పాటు సేనేట్ సభ్యులు ఆ బిల్లుపై ఇప్పటికే ముచ్చటించారు. పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ అంశంపై అధ్యక్షుడు ఎమ్మాన్యువల్ మాక్రన్ చాలా క్లారిటీతో ఉన్నారు. ఆ బిల్లును ఆయన సమర్ధిస్తున్నారు. ఇక హై స్కూళ్లలో మొబైల్ ఫోన్లను బ్యాన్ చేయాలని కూడా మాక్రన్ భావిస్తున్నారు.

# మల్లికార్జున్ ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు , రాజ్యసభ లో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 84వ ఏట అడుగుపెట్టిన ఖర్గేకు భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ప్రధాని తన సందేశాన్ని పంచుకున్నారు."రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ మల్లికార్జున్ ఖర్గే గారికి జన్మదిన శుభాకాంక్షలు. ఆయనకు భగవంతుడు దీర్ఘాయువును, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నా" అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. ప్రధానితోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సైతం ఖర్గేకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలను గుర్తుచేస్తూ రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవర అభినందనలు తెలియజేశారు. పార్టీ పట్ల, రాజ్యాంగంపట్ల ఖర్గేకు ఉన్న అంకితభావాన్ని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీ మాణిక్యం ఠాగూర్ కొనియాడారు. 1942 జూలై 21న కర్ణాటకలోని బీదర్ జిల్లాలో ఒక దళిత కుటుంబంలో జన్మించిన ఖర్గే.. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో విశేష అనుభవం గడించారు. పలుమార్లు ఎమ్మెల్యేగా, కేంద్రమంత్రిగా పనిచేసిన ఆయన.. ప్రస్తుతం కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022లో కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.

# సిక్కింలో ఘోర ప్రమాదం.. ఏడుగురు కార్మికులు మృతి



**న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ)** సిక్కింలోని నామ్చి జిల్లాలో సమర్‌డంగ్ సైట్‌లో నిర్మాణంలో ఉన్న టన్నెల్‌పై కొండచరియ విరిగిపడటంతో మూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు మరణించారని, పలువురు లోపలే చిక్కుకుపోయి ఉంటారని అధికారులు తెలిపారు. భారీ కొండచరియ విరిగిపడటంతో సొరంగం ప్రవేశద్వారం మూసుకుపోయింది. కొండచరియ విరిగిపడటం వల్ల మీథేన్ గ్యాస్ లీక్ అవడంతో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. మృతదేహాలను సింగ్‌టమ్ జిల్లా ఆసుపత్రి, గాంగ్‌టక్‌లోని ఎస్‌టిఎన్‌ఎం ఆసుపత్రి, నామ్చి జిల్లా ఆసుపత్రికి తరలించారు.


# నీట్ యూజీలో 522కు బదులు 95 మార్కులు




**న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** నీట్ యూజీ-2026 ఫలితాల్లో తీవ్ర వ్యత్యాసాలు వెలుగు చూస్తున్నాయి. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన సోనమ్ గవ్టే అధికారిక ఆన్సర్ కీతో తన ఓఎంఆర్ జవాబు పత్రాన్ని పోల్చి చూసినప్పుడు తనకు 522 మార్కులు రావాల్సి ఉందన్నాడు. అయితే ఎన్‌టీఏ విడుదల చేసిన స్కోర్ కార్డులో తనకు కేవలం 95 మార్కులు మాత్రమే వచ్చినట్లు చూపించారని గవ్టే ఆరోపిస్తున్నాడు. దీంతో బాంబే హైకోర్టు ధర్మాసనం ముందు రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు.

# కర్ణాటకలో దారుణం..

## 14 ఏళ్ల బాలిక కిడ్నాప్, సామూహిక అత్యాచారం



**న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** కర్ణాటకలో దారుణం జరిగింది. 14 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన కర్ణాటకలోని దేవహనల్లిలో ఈ నెల 17, శుక్రవారం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత బాలిక (14)ను రేణుక అనే యువతి దేవనహల్లి సమీపంలోని ఒక గుడికి తీసుకెళ్తానని నమ్మించింది. ఈ నెల 17న ఆమెను తీసుకుని వెళ్లి, నవీన్, వెంకట రమణ అనే యువకులకు అప్పగించింది. వారు బాలికను ఆటోలో ఎక్కించుకుని వేరే చోటుకు తీసుకెళ్లారు. ఇదే సమయంలో ఆటోలోనే బాలికకు బలవంతంగా ఆల్కహాల్ తాగించారు.తర్వాత బాలిక ఇంటివైపు ఆటోను తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత బాలిక మద్యం తాగి ఉండటం మంచిది కాదని భావించారు. ఇదే విషయం బాలికకు చెప్పారు. ఇప్పుడు నువ్వు మద్యం తాగి ఉన్నావని, ఇంటి దగ్గర దించితే మద్యం తాగినందుకు మీ నాన్న నిన్ను తిడతాడని చెప్పారు. అందువల్ల వేరే చోటుకు తీసుకెళ్తున్నామని చెప్పి, ఒక నిర్మాణంలో ఉన్న బిల్డింగు వద్దకు తీసుకెళ్లారు. ఎవరూ లేని ఆ ప్రదేశంలో రాత్రంతా ఇద్దరూ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమెపై దాడి కూడా చేశారు. అనంతరం ఉదయం బాలికను ఆమె ఇంటి వద్ద దింపేశారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. అయితే, రాత్రంతా తమ కూతురు ఇంటికి రాకపోయేసరికి బాలిక తల్లి, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో అప్పటికే అక్కడ ఆందోళనకర వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో బాలిక ఇంటికి చేరుకుంది. రాత్రంతా ఎక్కడికి వెళ్లావని బాలిక తల్లి, కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. దీంతో బాలిక జరిగిన విషయం వారికి చెప్పింది. ఇది విని తీవ్ర వేదనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు నవీన్, వెంకట రమణ, రేణుకను అరెస్టు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలిక కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# నోటిలో పెట్టుకుని విలువైన వజ్రం చోరీ..

## -సింగపూర్‌లో ఇద్దరు భారతీయులకు జైలుశిక్ష



**న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** ఇద్దరు భారతీయులు ఓ విలువైన వజ్రాన్ని చోరీ చేశారు. సింగపూర్‌లోని చైనాటౌన్‌లో ఉన్న ఓ షాపు నుంచి ఆ డైమండ్‌ను దొంగలించారు. మార్కెట్ ప్రకారం దాని విలువ సుమారు లక్షన్నర డాలర్లు ఉన్నది. అయితే నోట్లో పెట్టుకుని అసలు వజ్రాన్ని కాజేసిన ఆ ఇద్దర్నీ ఎయిర్‌పోర్టులో సింగపూర్ పోలీసులు పట్టుకున్నారు. వారికి శిక్షను ఖరారు చేశారు. 41 ఏళ్ల మంగ్రోలియా మనోజ్‌కుమార్ కుర్జీబాయ్‌కి రెండేళ్ల జైలుశిక్ష పడింది. అతనితో కలిసి 30 ఏళ్ల సెరసియా మిలన్ రామినిక్‌భాయ్ కూడా దొంగతనం చేశాడు.ఓ మీడియా కథనం ప్రకారం.. 4.95 క్యారెట్లు ఉన్న డైమండ్‌ను పోలిన ఓ నకిలీ వజ్రాన్ని తయారు చేశారు. సూరత్‌లో ఆ డమ్మీ వజ్రాన్ని తయారు చేసి సింగపూర్‌కు వెళ్లారు. అక్కడ షాపులోకి వెళ్లేముందు నోటిలో పెట్టుకుని నకిలీ వజ్రాన్ని తీసుకెళ్లారు. షాపింగ్ పేరుతో ఆ షాపులో ఉద్యోగుల్ని మాటల్లో పెట్టారు. ఆ తర్వాత అసలైన వజ్రాన్ని బయటకు తీయించారు. మంగ్రోలియా అనే వ్యక్తి సేల్స్ మేనేజర్‌ను కంట్రోల్ చేశాడు. ఇక మిలన్ అనే వ్యక్తి తన నోట్లో ఉన్న నకిలీ వజ్రాన్ని తీసి.. అసల వజ్రాన్ని కాజేశాడు. షాపు నుంచి వెళ్లేముందు తన నోట్లు అసలు డైమెండ్‌ను పెట్టుకుని వెళ్లిపోయాడు. జూలై 19వ తేదీన ఆ వజ్రంతో పరారీ అయ్యేందుకు సింగపూర్‌లోని చాంగీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కానీ ఈలోగా షాపులోని నిజమైన వజ్రం మాయమైనట్లు ఉద్యోగులు గుర్తించారు. చాంగీ ఎయిర్‌పోర్టు టర్మినల్ 3 వద్ద ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఆ ఇద్దర్నీ అరెస్టు చేశారు. మిలాన్ లెదర్ బ్యాగు నుంచి అసలు వజ్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కోర్టు ఇద్దరు భారతీయులకు శిక్షను ఖరారు చేసింది.

# లొంగిపోతావా.. బెయిల్ రద్దు చేయాలా..

## సోనమ్ రఘువంశీకి రెండు ఆప్షన్లు ఇచ్చిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో బెయిల్‌పై ఉన్న ప్రధాన నిందితురాలు సోనమ్ రఘువంశీకి సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. ఆమె విషయంలో రెండు ఆప్షన్లు ఇచ్చింది కోర్టు. ఒకటి తనకు తానుగా లొంగిపోవడం. రెండోది బెయిల్ రద్దు చేయడం. ఈ రెండింట్లో ఏదో ఒకటి ఎంచుకోవాలని కోర్టు సూచించింది. మేఘాలయకు గత ఏడాది భర్త రాజా రఘువంశీని హనీమూన్ తీసుకెళ్లిన సోనమ్ రఘువంశీ.. అక్కడ అతడిని హత్య చేయించిన సంగతి తెలిసిందే.ఈ కేసులో అరెస్టైన సోనమ్ ప్రస్తుతం బెయిల్‌పై విడుదలైంది. మొదట మేఘాలయ ట్రయల్ కోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని ప్రభుత్వం సవాలు చేస్తూ మేఘాలయ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, హైకోర్టు కూడా ఆమె బెయిల్‌ను సమర్థించింది. దీంతో సోనమ్ రఘువంశీ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ మేఘాలయ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలే ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. దీనిపై మంగళవారం సోనమ్ తరఫు న్యాయవాదికి కీలక సూచనలు చేసింది. రెండు ఆప్షన్లు ఇచ్చింది. ఒకటి ప్రభుత్వం కోరుతున్నట్లు సోనమ్ బెయిల్ రద్దు చేయడం. రెండోది.. ఆమె తనకుతానుగా కోర్టులో లొంగిపోయి, విచారణకు సహకరించడం. దీనిపై స్పందించిన సోనమ్ తరఫు న్యాయవాదులు ఈ అంశంపై సమాధానం చెప్పేందుకు గురువారం వరకు సమయం ఇవ్వాల్సిందిగా కోర్టును కోరారు. ఇదే సమయంలో అరెస్టు తర్వాత బెయిల్‌పై ఉన్న సోనమ్ ప్రవర్తన గురించి వివరణ ఇవ్వాలని కోర్టు సూచించింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్‌గా తుషార్ మెమతా వ్యవహరిస్తున్నారు. సోనమ్ బెయిల్ రద్దు చేయాలని ఆయన కోరుతున్నారు. సోనమ్ తనకుతానుగా పోలీసుల ఎదుట లొంగిపోయిందని, అందువల్ల అరెస్టుకు సరైన కారణాలు లేవన్న సాకుతో బెయిల్ కావాలని ఆమె కోరలేదని తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. అరెస్టు సమయంలో ఆమెకు జారీ చేసిన మెమోలో ఏదైనా లోపం ఉంటే, అది క్లరికల్ పొరపాటు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని రాజా రఘువంశీ కుటుంబం డిమాండ్ చేస్తోంది.

# బ్రిటన్‌లో తొలి ఏఐ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కనిష్క నారాయణ్



**న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** బ్రిటన్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ దేశానికి తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మంత్రి గా భారత మూలాలున్న కనిష్క నారాయణ్ బాధ్యతలు స్వీకరించారు. కనిష్క నారాయణ్‌ను ఏఐ మంత్రిగా నియమిస్తున్నట్లు భారత నూతన ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ మంగళవారం ఉదయం ప్రకటించారు. ఆ మేరకు తాజాగా కనిష్క నారాయణ్ బాధ్యతలు స్వీకరించారు. శరవేగంగా విస్తరిస్తున్న ఏఐ సాంకేతికతలో ప్రపంచస్థాయి అగ్రగామిగా నిలవాలన్న యూకే ప్రభుత్వ లక్ష్యానికి ఈ నియామకం అద్దం పడుతోంది.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ఏఐతో ముడిపడిన అవకాశాలను, సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఏఐ నియంత్రణ, నైతిక వినియోగం, ఆర్థికవ్యవస్థతో దాని అనుసంధానం వంటి అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టెక్నాలజీ పాలసీ, ఆవిష్కరణల రంగంలో అపార అనుభవం ఉన్న కనిష్క నారాయణ్ నియామకాన్ని ఒక వ్యూహాత్మక అడుగుగా భావిస్తున్నారు. ఏఐవల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకుంటూనే, దానితో ముడిపడిన ముప్పులను నివారించడం ఆయన ప్రధాన బాధ్యత కానుంది. కాగా కనిష్క వేల్స్ నుంచి ఎంపీగా గెలుపొందారు. ప్రధాని ఆండీ బర్న్‌హామ్ భారత మూలాలున్న ఇద్దరికి తన క్యాబినెట్లో చోటు కల్పించారు. వారిలో కనిష్క నారాయణ్‌తోపాటు లీసా నాండీ ఉన్నారు. కనిష్క గతంలో కీర్ స్టార్మర్ ప్రభుత్వంలోనూ మంత్రిగా పనిచేశారు. అప్పట్లో ఆన్‌లైన్ భద్రత, కృత్రిమ మేథ విభాగాలను పర్యవేక్షించిన ఆయన.. ఇప్పుడు పూర్తిస్థాయిలో ఏఐ మంత్రిగా నియమితులయ్యారు. బీహార్‌లో జన్మించిన కనిష్క నారాయణ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన ఆయన, 2025లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇక లీసా నాండీ, కీర్ స్టార్మర్ ప్రభుత్వంలో సాంస్కృతిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మాంచెస్టర్‌లో జన్మించిన ఆమె తండ్రి దీపక్ నాండీ పశ్చిమబెంగాల్‌కు చెందిన వారు కాగా.. తల్లి బ్రిటన్ జాతీయురాలు. లీసా 2010 నుంచి విగాన్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# వెనక్కి తగ్గేది లేదు

-ధర్మేంద్ర రాజీనామా చేయాల్సిందే

-ఢిల్లీలో కొనసాగుతున్న సీజేపీ నిరసనలు



**న్యూఢిల్లీ - 21 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** నీట్ ప్రశ్న పత్రం లీక్ వెనుక ఉన్న వారిని శిక్షిస్తామని ప్రధాని మోదీ ప్రకటించినప్పటికీ పోలీసులతో హింసాత్మక ఘర్షణలు జరిగిన మరుసటి రోజు మంగళవారం కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)కి చెందిన వేలాది మద్దతుదారులు మళ్లీ జంతర్ మంతర్ వద్ద తమ నిరసనను కొనసాగించారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ వైపుగా ర్యాలీ చేపట్టిన నిరసనకారులు సోమవారం పోలీసులతో హింసాత్మక ఘర్షణలకు దిగిన నేపథ్యంలో జంతర్ మంతర్ నిరసన స్థలి వద్ద 5,000 మందికిపైగా నిరసనకారులు నిరసనకు దిగారు. సెంట్రల్ ఢిల్లీలో సోమవారం జరిగిన ఘర్షణల్లో 118 మంది భద్రతా, పోలీసు సిబ్బంది, 60 మంది నిరసనకారులతో సహా దాదాపు 180 మంది గాయపడ్డారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. అయితే వివిధ దవాఖానలలో 150 మందికి పైగా నిరసనకారులు చికిత్స పొందుతున్నారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. ఈ అనాగరిక ఢిల్లీ పోలీసులు మా విద్యార్థులను, సహచరులను చితకబాదారు. మేము మా పోరాటాన్ని కొనసాగిస్తాం. ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తాం. ప్రధాన్ రాజీనామా చేసేంత వరకు వెనక్కి తగ్గం అని ఆయన స్పష్టం చేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# సిద్ధాపూర్ లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 641 ను రద్దు చేయాలి

**-రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం పై పోరాడేందుకు సమాయత్తం.**

**-ఈ డంపింగ్ యార్డు ను వ్యతిరేకించే వారందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి.**

**-సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక జాయింట్ యాక్షన్ కమిటీ.**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు సిద్ధాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 641 జీవో ను రద్దు చేయాలని సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూలై 02 వ తేదీ నాడు సిద్ధాపూర్ గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయటం కోసం 641 జీవో ను తీసుకువచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ.... ఇప్పటికే బిఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు విడి విడిగా ఆందోళన కార్యక్రమాలు చేస్తూనే ఉన్నాయి.. ఇలా ఈ అంశంపై విడి విడిగా కాకుండా ఐక్య పోరాటం కొరకు లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, అనంతరం అన్ని పార్టీలు , ప్రజా, కుల సంఘాలను కలుపుకుని ముందుకు వెళ్లాలని జరిగిన సమావేశంలో అందరి నిర్ణయం మేరకు " సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ" ని ఎన్నుకోవడం జరిగింది.. ఈ "సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ" మొదటి సమావేశం మంగళవారం నాడు షాద్ నగర్ దేవి గ్రాండ్ హోటల్ నందు చైర్మన్ రాంబాల్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిటీ లో చిన్న మార్పులు చేస్తూ తీర్మానం చేశారు. అనంతరం ఉద్యమాన్ని తీవ్రతరం చేయడం కోసం భవిష్యత్ కార్యాచరణ కోసం విస్తృతంగా చర్చించారు.. ముందుగా ఈ కమిటీ డంపింగ్ యార్డ్ వల్ల నష్ట పోతున్న గ్రామాలు మరియు మండలాల కమిటీలను ఏర్పాటు చేసుకుంటూ ప్రజలను ప్రత్యక్ష కార్యాచరణ కోసం సమాయత్తం చేయాలని తీర్మానం చేశారు.

ఈ సందర్భంగా సెంట్రల్ కమిటీ చైర్మన్ రాంబాల్ నాయక్ మాట్లాడుతూ... ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో, కూరగాయల సాగుతో హైదరాబాద్ మహానగరానికి అన్నం పెట్టిన ఆ పల్లె సీమలు నేడు విష వాయువుల కోరల్లో చిక్కుకుంటాయి అని, స్వచ్ఛమైన గాలి, మంచినీటితో ప్రశాంతంగా సాగుతున్న జనజీవనం అస్తవ్యస్తం అవుతుందన్నారు.. ఈ డంపింగ్ యార్డు వల్ల ఒక సిద్ధాపూర్ గ్రామమే కాదు చుట్టు పక్కల సుమారు 30 కిలో మీటర్ల మేర అన్ని ప్రాంతాలకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి తీరని అన్యాయం తప్ప ఉపయోగం లేదన్నారు. కనుక ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.

ఈ సమావేశంలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ సలహా దారులు వంగూరి గంగి రెడ్డి, అబ్దుల్ రబ్ జామి, రాజవరప్రసాద్, చైర్మన్ రాంబాల్ నాయక్ (ఎల్.ఎచ్.పి.ఎస్) వర్కింగ్ చైర్మన్ దొడ్డి శ్రీనివాస్ (బీఎస్పీ), కన్వీనర్ పినపాక ప్రభాకర్ (కార్మిక నేత), కో ఆర్డినేటర్లు తిరుమలయ్య (పౌర హక్కుల సంఘం), టీజీ శ్రీనివాస్ (టీయూ జేఏసీ), కో-చైర్మన్లు సత్యనారాయణ (బిఆర్ఎస్ ), మోహన్ సింగ్ (బీజేపీ) , బుద్దల జంగయ్య (సీపీఐ), ఈశ్వర్ నాయక్ (సిపిఎం), పెంటనోళ్ల నరసింహ (ఎమ్మార్పీఎస్), బొజ్జ శ్రీనివాస్ రెడ్డి (సిద్ధాపూర్) , బాలస్వామి (సిద్ధాపూర్) , రజిత (ఖాజా గూడ తండా) , కో-కన్వీనర్లు అర్జున్న (టిపిఎఫ్) , రవీంద్రనాథ్ (పీఏసీ) , ప్రశాంత్, (బీసీ జన సేన), వి శ్రీకాంత్ (ఎస్ఎఫ్ఐ) , పవన్ (ఏఐఎస్ఎఫ్ఐ) , సత్యనారాయణ (పీపీ జాక్ ) , వర ప్రసాద్ (బీసీ సేన) , బిత్యా నాయక్ (ఎల్ఎచ్పిఎస్) , మరియు శ్రీధరా చారి (సిద్ధాపూర్) తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను వేధించింది కేసీఆర్ ప్రభుత్వమే

**-షాద్‌నగర్ తెలంగాణ ఉద్యమకారుడు టీజీ శ్రీనివాస్**

**-అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఎంతమందికి ఇచ్చారో చెప్పాలి**

**-ఉద్యమకారులపై కేసులు పెట్టి, ఉద్యోగులను వేధించారు**

**-కేసీఆర్‌కు ఉద్యమకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు**

**- కోదండరాం నుంచి రాంబల్ నాయక్ వరకు ఉద్యమకారులను ఇబ్బందులకు గురిచేశారు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా వేధించిందని తెలంగాణ ఉద్యమకారుడు టీజీ శ్రీనివాస్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ అసెంబ్లీలో 1,200 మంది తెలంగాణ కోసం అమరులయ్యారని ప్రకటించారని, అయితే వారిలో ఎంతమంది కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. 500 మందికి కూడా రూ.10 లక్షలు అందలేదని ఆయన ఆరోపించారు. అమరవీరుల కుటుంబాల వివరాలు తమ ప్రభుత్వానికి తెలియవని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించారని టీజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు.తెలంగాణ జనసేనాని ప్రొఫెసర్ కోదండరాం నుంచి రాంబల్ నాయక్ వరకు పలువురు ఉద్యమకారులను గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. కోదండరాం పక్కన కూర్చున్న ఉద్యోగులకు ఛార్జ్ మెమోలు ఇచ్చారని, కొంతమంది ఉద్యోగులను పదవుల నుంచి తొలగించారని అన్నారు. మరికొందరు ఉద్యమకారులపై కోర్టు కేసులు పెట్టి, ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులతో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. షాద్ నగర్ లో తెలంగాణ ఉద్యమకారుడు గిరిజన బిడ్డ రాంబల్ నాయక్ పై కూడా రౌడీషీట్ కేసు పెట్టి వేధించారని గుర్తు చేశారు.షాద్ నగర్ లో ఉద్యమకారులకు ఏం ఒరిగిందని ప్రశ్నించారు. ఎంతోమంది ఉద్యమం దెబ్బకు ఇంకా కోలుకోలేని పరిస్థితుల్లో యువత నిరుద్యోగులు ఉన్నారని టీజీ శ్రీనివాస్ అన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని టీజీ శ్రీనివాస్ అన్నారు. అందుకే ఉద్యమకారులు, ఉద్యోగులు బీఆర్ఎస్‌కు దూరమయ్యారని పేర్కొన్నారు. అధికారం కోల్పోయి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉద్యమకారులను గుర్తించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి కూడా తమ వద్ద డబ్బులు లేవని గత ప్రభుత్వం ప్రకటించిందని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమకారులపై ఎవరికీ పేటెంట్ లేదని స్పష్టం చేశారు. ఉద్యమకారుల ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఆరోపించిన టీజీ శ్రీనివాస్, గత ప్రభుత్వం చేసిన తప్పులకు ముందుగా ఉద్యమకారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# అమరవీరుల పేరుతో మాటలు కాదు... చేతల్లో చూపించింది కేసీఆర్ ప్రభుత్వం!

**- మన్నె నారాయణ, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ డైరీ) ,:** ఇటీవల షాద్‌నగర్‌లో జరిగిన పలు వేదికలపై తెలంగాణ అమరవీరుల గురించి గొప్పగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, ఒక విషయం తెలంగాణ ప్రజలకు చెప్పాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మన్నె నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం అందించిన ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం విద్యార్థులు, యువకులు, ప్రజలు ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. ఆ సమయంలో ఉద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడిన వారు, ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రశ్నించిన వారు, నేడు ఉద్యమకారుల గురించి గొప్పలు చెప్పడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. సభల్లో "ఉద్యమకారులకు గుర్తింపు ఇస్తాం", "ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం", "ఆశయాలు నెరవేరుస్తాం" అంటూ కొత్త హామీలు ఇవ్వడం కాదు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాలను గౌరవించడం అంటే కేవలం స్తూపాలు నిర్మించడం మాత్రమే కాదని, వారి కుటుంబాలకు అండగా నిలవడం, ఉద్యమకారులకు న్యాయం చేయడం, ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన కేసీఆర్ గారి పాలనలో అమరవీరులకు గౌరవం, ఉద్యమకారులకు గుర్తింపు లభించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ రోజు నిజంగా ఉద్యమకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకుని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తే మాకెంతో సంతోషమే. ఉద్యమకారులకు మేలు జరిగితే రాజకీయాలకు అతీతంగా స్వాగతిస్తాం. కానీ మాటలు ఒకలా, చేతలు మరోలా ఉండకూడదు. తెలంగాణ కోసం త్యాగం చేసిన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది అని మన్నె నారాయణ స్పష్టం చేశారు.

## హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పురోగతిని పరిశీలించిన సీఎం

నిర్మాణ పనులు నిదానంగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం
పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి
ఎడ్యుకేషన్ హబ్ లో ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశం
పనుల్లో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవన్న సీఎం
నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ కు వెనకాడొద్దన్న సీఎం
భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం
వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశం

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్వోసీ పత్రాలను అందజేసిన గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ డైరీ) :** మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ కి చెందిన నాగభూషణ రావు కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2,50,000/- రెండు లక్షల యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎల్వోసీ మంజూరి పత్రాన్ని మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబానికి అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్**

**షాద్‌నగర్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ డైరీ):** నీట్--యూజీ పరీక్షల అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్--యూజీ అక్రమాలపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం, విద్యార్థులను అణచివేయడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనకు నిరసనగా షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనన్నారు. విద్యార్థులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎన్ని నిర్బంధాలు, లాఠీచార్జ్‌లు చేసినా విద్యార్థి ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. భగత్‌సింగ్ వారసులుగా విద్యార్థుల హక్కుల కోసం ప్రాణాలు పోయినా పోరాడుతామని ఆయన అన్నారు. నీట్--యూజీ ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా పరిశీలన



**జగిత్యాలజిల్లా (జర్నలిస్ట్ డైరీ) :** ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో నీటి సరఫరా విధానాన్ని ఎంపీడీవో సీహెచ్ గణేష్, ఎంపీఓ రామకృష్ణరాజు పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు . గ్రామపంచాయతీలోని రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈలు మల్లేష్, వింధ్యారాణి, కార్యదర్శి రవళి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను పరిశీలించిన ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ డైరీ)**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు సుందరికరణ, సంరక్షణ,అభివృద్ధి పనులలో భాగంగా రూ. 2 కోట్ల 74 లక్షల రూపాయల అంచనావ్యయం తో చెరువులో మురుగు నీరు కలవకుండా చేపడుతున్న మురుగు నీటి మల్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులను మరియు చెరువు సుందరీకరణ పనులను పరిశీలించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఎల్లమ్మ చెరువు లో కలుషిత డ్రైనేజీ నీరు కలవడం వలన దుర్వాసన వస్తుంది అని స్థానిక చుట్టుపక్కల కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు చెరువును పరిశీలించడం జరిగినది అని తెలియచేశారు. చెరువులో కలుషిత నీరు కలవకుండా వేసిన ప్రత్యేక పైప్ లైన్ లో అనేక మ్యాన్‌హోల్స్ చెత్త , చెదారం తో నిండి పూర్తిగా మూసుకుపోవడంతో డ్రైనేజీ నీరు చెరువులోకి పొంగి ప్రవహిస్తున్నట్లు గుర్తించడం జరిగినది అని, వెంటనే మున్సిపల్ సిబ్బందిని, జేసీబీ ని అక్కడికి రప్పించి, డ్రైనేజీ పైప్‌లైన్ మరియు ప్రతి మ్యాన్‌హోల్స్ లో చెత్త , చెదారం తొలగించి, శుభ్రపరిచి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చేయడం జరిగినది అని, ఇక చెరువు లో డ్రైనేజీ నీరు కలవకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని తెలియచేశారు.ఎమ్మెల్యే శ్రీ గాంధీ దాదాపు ఏడు గంటల పాటు అక్కడే ఉండి ప్రతి పనిని స్వయంగా పర్యవేక్షిస్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు అందిస్తూ పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చేశారు అని, ఎన్నో సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఈ సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే గాంధీ చూపుతున్న ప్రత్యేక చొరవ, అంకితభావం, నాయకత్వం మరియు వ్యక్తిగత పర్యవేక్షణ నిజంగా అభినందనీయం అని, ఆయన చిత్తశుద్ధి, దృఢ సంకల్పం వల్ల చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందనే విశ్వాసం కలుగుతోంది అని కాలనీ వాసులు తెలియచేస్తూ ఎమ్మెల్యే గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.జేఏసి బృందం మరియు చుట్టుపక్కల కాలనీల ప్రజల తరఫున ఎమ్మెల్యే గాంధీ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న విశేష సేవలకు మనమందరం అభినందనలు తెలుపుదాం అని సంతోషం వ్యక్తం చేశారు.ఎల్లమ్మ చెరువు సుందరికరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది అని, చెరువు లో కలుషిత నీరు కలవకుండా చేపట్టిన డ్రైనేజీ వ్యవస్థ మల్లింపు లో భాగంగా పైప్ లైన్ వద్ద ప్రతి మ్యాన్ హోల్ లో పేరుక పోయిన చెత్త, చెదారం ను వెంటనే తోగించాలని, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, నీటి ప్రవాహం కు అడ్డంకులను తొలగించాలని, పైప్ లైన్ లో నీటి ప్రవాహం సాఫీగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని తెలియచేశారు.చెరువు లో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజి వ్యవస్థ మల్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజి వ్యవస్థ మల్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులకు వేగం పెంచాలని, పనులు నాణ్యత ప్రమాణాల తో చేపెట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని తెలియచేసారు, చుట్టుపక్కల కాలనీల నుండి వచ్చే మురుగు నీరు చెరువులో కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ,చెరువు చుట్టుపక్కల నివసిస్తున్న కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, మురుగు నీటి మల్లింపు పైప్ లైన్ ద్వారా చెరువులో కలుషిత నీరు కలవకుండా సస్యశ్యామలం గా , చక్కటి ఆహ్లాదకరం గా చెరువు ను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని , చెరువు చుట్టూ పక్కల కాలనీల ప్రజలకు ఎంతగానో సాంత్వన నేటితో చేకూరింది అని తెలియచేసారు , ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని పనులు వేగవంతం చేయాలని, పనులు నాణ్యత ప్రమాణాల తో చేపట్టాలని తెలియచేసారు. అదేవిధంగా చెరువు సుందరికరణ లో భాగంగా చెరువు కట్ట పటిష్టం పరిచేలా పునరుద్ధరణ , మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి మల్లింపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం , పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని తెలియచేసారు. చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణము మరియు చెరువు సుందరికరణ పనులు చేపడుతున్నాం అని , చెరువు సుందరికరణ మరియు అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు అదేవిధంగా ప్రణాళిక తో పనులు చేపట్టాలని తెలియచేసారు . అదేవిధంగా చెరువులను సంరక్షణిచడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా ఎల్లమ్మ చెరువును సుందరవనం గా , శోభితవర్ణం గా తీర్చిదిద్దుతామని, అదేవిదంగా చెరువు ల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెరువు ల ను సంరక్షిస్తామని తెలియచేసారు . చెరువు ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మల్లింపు పైప్ లైన్ నిర్మాణం పనుల గూర్చి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది . చెరువు అపరిశుభ్రం వలన పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన దోమల పెరగడం వలన స్థానికులకు ఏర్పడుతున్న ఇబ్బందులను , అనారోగ్యాలకు గురవడం స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే కి పిర్యాదు చేయడం వలన దీనికి స్పందించిన చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క ను తొలగించి, చెరువును శుభ్రపరిచి సుందరీకరణ చేసిన సంగతి విదితమే . అదేవిధంగా ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని చెప్పడం జరిగినది , తామర పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామని చెప్పటం జరిగినది . చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని , చెరువులు కలుషితం కాకుండా మరియు కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయి లోసంరక్షిస్తామని , చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసి , ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని, అలాగే నియోజకవర్గం లోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని చెప్పటం జరిగినది చెరువుల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీల వాసులు ,స్థానికులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

**-ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**
**-సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోంది**
**-జీవో రద్దు కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేస్తున్నారు**
**-ముఖ్యమంత్రి తమ డిమాండ్‌ను అంగీకరిస్తారన్న నమ్మకం ఉంది**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ డైరీ) :**
సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో నంబర్ 641ను వెంటనే ఉపసంహరించుకోవాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ నిర్మాణానికి వ్యతిరేకంగా మంగళవారం స్థానిక సిద్ధాపూర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, కొత్తూరు మండల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితర నేతలతో కలిసి చౌలపల్లి ప్రతాప్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యను స్వయంగా వివరించేందుకు ప్రయత్నించారు. అయితే కలెక్టర్ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా సమీక్ష సమావేశంలో ఉండటంతో, మరుసటి రోజు కలవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. జీవో నంబర్ 641ను వెనక్కి తీసుకుని సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకునే విషయంలో ప్రభుత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ప్రభుత్వం కచ్చితంగా జీవో 641ను వెనక్కి తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ వెలుపల కాలుష్యకర పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి నిర్ణయాలు తీసుకుని భూసేకరణ చేపట్టిందని, వాస్తవాలు అందరికీ తెలుసని అన్నారు. ఈ విషయంలో అనవసరంగా కాంగ్రెస్ పార్టీపై బురదజల్లడం సరికాదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్‌ను అంగీకరిస్తారనే నమ్మకం ఉందని, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా జీవో రద్దు కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తెలిపారు. బుధవారం మరోసారి కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు.

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

**-ఉమ్మడి మండలాల ఉద్యమకారుల డిమాండ్**
**-ఎన్నికల మేనిఫెస్టో హామీల మేరకు గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి**
**-రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమకారులంతా ఏకమై పోరాడాలి**
**-ఈ నెల 25న చౌదరిగూడెంలో మరో కీలక సమావేశం**
**-ఉమ్మడి మండలాల తెలంగాణ ఉద్యమ నేత మంగులాల్ నాయక్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ డైరీ) :**
కొందుర్గు, చౌదరిగూడెం ఉమ్మడి మండలాల తెలంగాణ ఉద్యమకారుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇవ్వలేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యమకారులను వెంటనే గుర్తించి గౌరవించాలని కోరారు. ఈ సందర్భంగా కొందుర్గు, చౌదరిగూడెం ఉమ్మడి మండలాల తెలంగాణ ఉద్యమ నేత మంగులాల్ నాయక్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ నాయకత్వంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. గతంలో షాద్‌నగర్ ప్రాంతంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొందరు ఉద్యమకారులు పాల్గొనలేకపోయారని తెలిపారు. అందుకే రాజకీయ పార్టీలకు అతీతంగా ఉమ్మడి మండలాల పరిధిలోని ఉద్యమకారులందరినీ ఏకం చేసి ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యమకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25వ తేదీన చౌదరిగూడెం మండలంలో ఉమ్మడి మండలాల తెలంగాణ ఉద్యమకారుల మరో కీలక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాల్గొన్న నాయకులు బీఆర్ఎస్ నుంచి ఉద్యమ కారులు శ్రీధర్ రెడ్డి, బాబూరావు, బాలరాజ్. బీజేపీ నుంచి భూపాలచారి, లక్ష్మీకాంత్ రెడ్డి, బలవంత్ రెడ్డి, బోయ శంకర్. ఇతర ఉద్యమ కారులు శంకర్ గౌడ్, రవికుమార్, మాసయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ తొలి మంగళవారం..



**-శాఖంబారి దేవిగా వాసవి మాత దర్శనం**
**-ప్రత్యేక పూజల్లో భక్తుల వెల్లువ..**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆషాఢ మాసం తొలి మంగళవారం సందర్భంగా ఆర్యవైశ్య మహిళా సంఘం షాద్నగర్ ఆధ్వర్యంలో అమ్మవారిని శాఖంబారి దేవి అవతారంలో అత్యంత వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాసు పంతులు వేదమంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శాఖంబారి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి మాతను దర్శించుకునేందుకు మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి పూలు, పండ్లు, కూరగాయలతో విశేష అలంకరణ చేయడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. భక్తులు ప్రత్యేక అర్చనలు నిర్వహించి కుటుంబాల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కోసం ప్రార్థనలు చేశారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు గబ్బుల శ్రీలత, ప్రధాన కార్యదర్శులు మలిపెద్ది శ్రీదేవి, రాచమల్ల గీత, కోశాధికారి ఆగిరు ఉమాదేవి కమిటీ కార్యవర్గం ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొడంగల్ ప్రగతి పరుగులు





-హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఉక్కుపాదం

-హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల మందగమనంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి

-పనుల్లో అలసత్వం వహించే అధికారులపై సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరిక

-భూములు కోల్పోయిన రైతులకు వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు పంపిణీ చేయాలని ఆదేశం

-జూన్ 2, 2028 నాటికి నియోజకవర్గంలో ప్రతి తాండకు బీటీ రోడ్డు నిర్మించేలా మాస్టర్ ప్లాన్

- సెప్టెంబర్ 30 నాటికి పారిశ్రామిక పార్కులు ఎడ్యుకేషన్ హబ్ కోసం 10 వేల ఎకరాల భూసేకరణ లక్ష్యం.

**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 21:-** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేట్‌లో రూపుదిద్దుకుంటున్న ప్రతిష్ఠాత్మక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వెటర్నరీ కళాశాల ఇంజనీరింగ్ కళాశాల హాస్టళ్ల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు.క్షేత్రస్థాయిలో పనుల పురోగతి ఆశించిన వేగంతో సాగకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు.పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులని ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన నెలవారీ పురోగతి నివేదికలను క్రమం తప్పకుండా తన వద్దకు పంపాలని స్పష్టం చేశారు.పనుల్లో అలసత్వం వహించే అధికారులను వెనుకాడకుండా సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ లబ్ధిదారులందరికీ వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు అందజేయాలని స్పష్టం చేశారు.సమీక్షా సమావేశంలో నియోజకవర్గ మౌలిక వసతులు రహదారుల అభివృద్ధిపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలోని 8 మండలాల పరిధిలో ఆర్అండ్ బి రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక అధికారిని నియమించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. జూన్ 2, 2028' నాటికి నియోజకవర్గంలో రోడ్ల రూపురేఖలు మారిపోవాలని ప్రతి గిరిజన తాండకు బీటీ రోడ్డు సదుపాయం కల్పించాలని ఆదేశించారు.శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుండి కొడంగల్‌కు రోడ్డు కనెక్టివిటీ శంషాబాద్-కొడంగల్ కనెక్టివిటీ రోడ్ల నిర్మాణంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పనుల భూసేకరణను సెప్టెంబర్ 2026 నాటికి ప్రాజెక్టును ఆగస్టు 15, 2028 నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు.మండల స్థాయి సమస్యలపై చర్చించేందుకు ఎంపీడీవోలు సర్పంచులు స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.మరోవైపు పారిశ్రామిక రంగం ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షిస్తూ సుమారు 7 వేల మంది విద్యార్థులకు విద్యనందించే ఎడ్యుకేషన్ హబ్ దుద్యాల ఇండస్ట్రియల్ పార్కుల కోసం సెప్టెంబర్ 30 నాటికి 5 వేల నుండి 10 వేల ఎకరాల భూసేకరణ పూర్తి చేయాలని టీజీఐఐసి అధికారులకు స్పష్టం చేశారు.మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం అదనపు పంపుల సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిసెంబర్ 2027 వరకు నెలవారీ లక్ష్యాలను సంతకాలతో సహా సమర్పించాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డిలతో పాటు వివిధ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీలు,ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం కల్పించాలి.





### తెలంగాణ అస్తిత్వ మీడియా సంస్థలను ప్రోత్సహించాలి: అల్లం నారాయణ



**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కలంతో కెమెరాలతో, వార్తల ద్వారా ఒకపక్క పోరాడుతూనే మరోపక్క ప్రత్యక్ష ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ జర్నలిస్టులను గుర్తించి వారికి తగిన గుర్తింపు, గౌరవం, సంక్షేమం పథకాలు అమలు చేయాలని తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ అధ్యక్షుడు అల్లం నారాయణ కోరారు. సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న తెలంగాణ అమర వీరుల స్మారక కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు కమిటీకి మంగళవారం టీజే ఎఫ్ పలు డిమాండ్లు, సూచనలతో కూడిన ఒక వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా టీజే ఎఫ్ అధ్యక్షుడు అల్లం నారాయణ మాట్లాడుతూ సమైక్యాంధ్రలో ఆంధ్రా యాజమాన్యాలు, హెచ్ ఓడిల కింద పనిచేస్తూనే, ఉద్యోగాలను సైతం ఫణంగా పెట్టి తెలంగాణ జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేశారని అన్నారు. ఎన్నో అవమానాలు, వత్తిడులు, ప్రభుత్వ, పోలీసుల నిర్బంధాలను ఎదుర్కొని జర్నలిస్టులు పనిచేశారు అన్నారు. ఉద్యోగం ఉంటుందో, పోతుందో తెలియని పరిస్థితుల్లో కూడా జర్నలిస్టుల పోరాటం మరువలేనిది అన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు పూర్తయినా, ఇంకా ఆంధ్రా భావజాల మీడియానే తెలంగాణలో రాజ్యమేలుతుందని, తెలంగాణ అస్తిత్వంతో కూడిన మీడియా సంస్థలను ఏర్పాటు చేయాలని, ఆదిశగా ప్రభుత్వం ఆలోచించాలని అల్లం నారాయణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని కోరారు.

అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ప్రాధానమైన ఐదు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

1. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న జర్నలిస్టులను అధికారికంగా తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి, వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇతర సంక్షేమ పథకాలు త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా సిఫారసు చేయలని కోరారు.

2. మీడియా రంగంలోకి కొత్తగా వచ్చే యువ జర్నలిస్టుల వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించి, మీడియా అకాడమీ ద్వారా వాటిని మరింత బలోపేతం చేసేలా సిఫారసులు చేయాలన్నారు.

3. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ జర్నలిస్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించడం ద్వారా కొత్తగా ఏర్పడే మీడియా సంస్థల్లో అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేయాలని కోరారు. ఇది జర్నలిస్టుల సంక్షేమానికి దోహదపడటమే కాకుండా తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు కూడా ఉపయోగపడుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

4. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా తెలంగాణ మీడియా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, ఉద్యమంలో ముందుండి పోరాడిన సీనియర్ సంపాదకులు, జర్నలిస్టుల నేతృత్వంలో తెలంగాణ మీడియా హౌస్‌ల స్థాపనకు ప్రభుత్వం రూ.1,000 కోట్ల ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు.

5. తెలంగాణ ఉద్యమంలో కలంతో, కెమెరాతో పోరాడిన జర్నలిస్టుల సేవలకు తగిన గౌరవం, గుర్తింపు, భద్రత కల్పించడం ద్వారా మాత్రమే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి నిజమైన గౌరవం చెల్లించినట్లవుతుంది. ఈ వినతులను సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేయాలని కోరారు.

ఉద్యమ కారుల గుర్తింపు కమిటీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో అల్లం నారాయణతో పాటు సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, టీజెఎఫ్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, టీజేఎఫ్ రాష్ట్ర నాయకులు ఎ.రమణ కుమార్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, కోశాధికారి పి.యోగనంద్, రమేష్ పల్లె వెంకన్న, చిత్రం సైదులు, సురేష్, తెలంగాణ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి యాదగిరి గౌడ్, సీనియర్ జర్నలిస్టులు, కందుకూరి రమేష్ బాబు, ఓరుగంటి సతీష్, సూరజ్, రమణ, బలరాం, చైతన్య, యుగేందర్,విద్యా వెంకట్, కట్ట కవిత,సుమబాల, నెల్లుట్ల కవిత, లతో పాటు పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఖేడ్ ఎంపిడిఓగా రత్నవాణి



**నారాయణఖేడ్,జులై 21 (జర్నలిస్ట్ డైరీ) :** ఖేడ్ మండల పరిషత్ అభివృద్ధి అధికాణిగా బి.ఈ.ఏ. రత్నవాణి ఈనెల 18న బాధ్యతలు చేపట్టారు.మునిపల్లి మండల ఎంపిడిఓ గా పనిచేసిన ఆమె బదిలిపై నారాయణఖేడ్ మండలానికి వచ్చారు.ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీనివాస్ రెడ్డిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం విధితమే,ఆయన స్థానంలో రత్నవాణి బాధ్యతలు చేపట్టారు.

## ఏఐసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలో పాల్గొన్న ఎంపి



**నారాయణఖేడ్,జులై 21 (జర్నలిస్ట్ డైరీ) :** భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.న్యూడిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో నిర్వహించిన మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలో ఆయన పాల్గొని పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు మల్లు రవి, బలరాం నాయక్,చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీ తదితరులు పాల్గొన్నారు.

## పన్నులు సకాలంలో చెల్లించాలి



**నారాయణఖేడ్,జులై 21 (జర్నలిస్ట్ డైరీ) :** పన్నులు సకాలంలో చెల్లించాలని,గ్రామ పరిశుభ్రతలో అందరు సహకరించాలని సిర్గాపూర్ సర్పంచ్ శ్రీనివాసరావు అన్నారు.మంగళవారం సిర్గాపూర్ మండల కేంద్రంలోని వ్యాపారస్తులతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నర్సింహా గౌడ్ లు మాట్లాడుతూ.. వ్యాపారులు ఇష్టానుసారంగా రోడ్లపై చెత్తవేయరాదనీ, గ్రామ పరిశుభ్రత పాటించాలని,పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలన్నారు.ఈ సమావేశంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది,వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జున కార్గే జన్మదిన వేడుకలు



**రామన్నపేట జూలై 21 (జర్నలిస్ట్ డైరీ) :** యాదాద్రి భువనగిరి జిల్లారామన్నపేట సుభాష్ సెంటర్ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన సందర్భంగా సుభాష్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు పున్న జగన్మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు జమీరుద్దీన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కందిమల్ల గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జెల్లా వెంకటేష్, గుత్తా నర్సిరెడ్డి , వనంచంద్రశేఖర్, సాల్వేర్ అశోక్ , శంబాల వెంకన్న, మొహమ్మద్ నాసర్, రాయిని రమేష్ , కోట సుధాకర్, లక్ష్మణ్ మహమ్మద్ రిజ్వాన్ ,బండ అంజిరెడ్డి ,ఏటేల్లి పరమేశ్, లెంకల ప్రవీణ్, మొహమ్మద్ అజార్ ,శోభ ,కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# బిజినెస్

## ఆగస్టు నుంచి పెరగనున్న మారుతి సుజుకి కార్ల ధరలు!



దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా తమ ప్యాసింజర్ వాహనాల ధరలను 2026 ఆగస్టు నుంచి గరిష్ఠంగా రూ. 30,000 వరకు పెంచనున్నట్లు ప్రకటించింది. ముడిసరుకుల వ్యయం పెరగడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఎస్ఈ ఫైలింగ్‌లో తెలిపింది. వాహనాల మోడల్‌ను బట్టి ఈ ధరల పెంపు భిన్నంగా ఉంటుందని, వినియోగదారులపై ఎక్కువ భారం పడకుండా చూస్తామని కంపెనీ స్పష్టం చేసింది.

### త్వరలో బజాజ్ పల్సర్ 150 కొత్త మోడల్ విడుదల



బజాజ్ ఆటో తన ప్రజాదరణ పొందిన పల్సర్ 150 మోడల్ కొత్త వెర్షన్‌ను త్వరలో విడుదల చేయనుంది. ఈ మోడల్ ప్రవేశపెట్టిన 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అప్‌డేటెడ్ మోడల్‌ను మార్కెట్లోకి తీసుకురావడానికి కంపెనీ సిద్ధమవుతోంది. ఈ కొత్త మోడల్‌లో కొత్త ఛాసిస్, సవరించిన ఇంజిన్, మెరుగైన సస్పెన్షన్, అత్యాధునిక సాంకేతికతలను పొందుపరుస్తారని భావిస్తున్నారు. 2001లో ప్రవేశపెట్టినప్పటి నుండి పల్సర్ వివిధ మోడళ్లు విడుదలయ్యాయి, అయితే 150 సిసి మోడల్ ఇప్పటికీ ప్రజల ఆదరణ పొందుతోంది.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు.. 10 గ్రాముల ధర ఎంతంటే..!



మంగళవారం దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు తగ్గడం, పశ్చిమాసియా లో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి కారణాలతో సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడికి డిమాండ్ పెరిగింది. దాంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) లో మంగళవారం ఉదయం 11:20 గంటల సమయంలో ఆగస్ట్ డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1,460 పెరిగి 10 గ్రాములకు రూ.1,42,848 వద్ద ఇంట్రాడే గరిష్ఠ స్థాయికి చేరుకుంది. అదేవిధంగా సెప్టెంబర్ డెలివరీ సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.3,380 పెరిగి కిలోకు రూ.2,21,780 గరిష్ఠాన్ని తాకింది. ట్రేడింగ్ ప్రారంభంలో 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,386, కిలో వెండి ధర రూ.2,19,200 గా నమోదైంది. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల దిగువకు పడిపోవడం దేశీయ బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయనే నివేదికలు, ఇరాన్‌పై అమెరికా తన వైమానిక దాడులను నిలిపివేసిందని వచ్చిన వార్తలు ముడి చమురు ధరల తగ్గుదలకు కారణమయ్యాయి. గతంలో ముడి చమురు ధరలు పెరిగినప్పుడు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగి, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వంటి కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచుతాయనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే మార్కెట్ నిపుణుల ప్రకారం ప్రస్తుతం కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి, బలమైన డాలర్ ఒత్తిడిని అధిగమించి సురక్షిత పెట్టుబడిగా బంగారానికి మద్దతునిస్తోంది. ఈ కారణంగానే పెట్టుబడిదారులు బంగారంవైపు మొగ్గు చూపుతున్నారని వారు విశ్లేషిస్తున్నారు.

## చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం.. ఆగిపోయిన ఇమేజ్ జనరేషన్ ఫీచర్.. ఓపెన్ ఏఐ విచారణ




ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది వినియోగిస్తున్న ఏఐలలో చాట్‌జీపీటీ ఒకటి. ఓపెన్‌ఏఐ సంస్థ దీన్ని నిర్వహిస్తోంది. తాజాగా చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఇమేజ్ జనరేషన్ ఫీచర్ ప్రపంచంలోని అనేక దేశాల్లో ఆగిపోయినట్లు తెలుస్తోంది. దీంతో వినియోగదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఇది తాత్కాలికంగానే ఆగిపోయింది. చాట్‌జీపీటీలో మిగతా ఫీచర్స్ బాగానే పని చేస్తున్నాయి. చాట్‌జీపీటీ డ్యాష్‌బోర్డ్‌లోని ఇమేజ్ జనరేషన్ ఫీచర్ కొంతసేపటి క్రితం నిలిచిపోయింది. దీనిపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు రావడంతో చాట్‌జీపీటీ యాజమాన్య సంస్థ ఓపెన్‌ఏఐ దీనిపై విచారణ జరుపుతోంది. త్వరలోనే సేవల్ని పునరుద్ధరిస్తామని, ఫీచర్ అందుబాటులోకి తెస్తామని పేర్కొంది. యూజర్లు ఏఐ ఇమేజ్ క్రియేట్ చేస్తుంటే పని చేయడం లేదు. ఇదే సమయంలో టెక్స్ట్ బేస్డ్ కన్వర్జేషన్స్, ఇతర సర్వీసులు బాగానే అందుతున్నాయి. ఓపెన్‌ఏఐ చాట్‌జీపీటీలో ఎక్కువ మంది వాడే ఫీచర్లలో ఇమేజ్ జనరేషన్ ఒకటి. దీని ద్వారా పలువురు ఏఐ ఇమేజ్‌లతోపాటు ఇల్లస్ట్రేషన్స్, ఆర్ట్ వర్క్, గ్రాఫిక్స్, ఎడిటెడ్ ఇమేజెస్ వంటివి క్రియేట్ చేసుకుంటారు. ప్రతివారం ఈ ప్లాట్‌ఫామ్‌పై బిలియన్ల కొద్దీ ఇమేజ్‌లు క్రియేట్ అవుతున్నాయి. చాట్‌జీపీటీలో ఈ ఫీచర్ ప్రారంభమైన తొలి వారంలోనే 130 మిలియన్ల యూజర్లు 700 మిలియన్ల ఇమేజ్‌లు క్రియేట్ చేశారు. ప్రస్తుతం ఒక వారానికి 1.5 బిలియన్ల ఇమేజ్‌లు క్రియేట్ అవుతున్నాయి. ఇమేజ్ ఎడిటింగ్‌ను కూడా చాట్‌జీపీటీ సులభతరం చేసింది. దీనిలో ఇమేజ్‌లు ఎడిట్ చేయడం కూడా చాలా తేలిక.

## ఆగస్టులో హాకీ వరల్డ్‌కప్.. భారత కుర్రాళ్లకు భలే ఛాన్స్..!




ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ వరల్డ్ కప్ సమీపిస్తోంది. నెదర్లాండ్స్ వేదికగా ఆగస్టులో ఈ మెగా టోర్నీ జరుగనుంది. దాంతో, మంగళవారం 20 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది హాకీ ఇండియా . అంతర్జాతీయ అనుభవమున్న సీనియర్లు, ప్రతిభావంతులైన జూనియర్లకు స్క్వాడ్‌లో చోటు దక్కింది. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం అందించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో భారత హాకీ జట్టు వరల్డ్‌కప్ బరిలో దిగనుంది.హాకీ వరల్డ్‌కప్ కోసం సమతూకంతో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేసింది హాకీ ఇండియా. డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా 20 మందితో కూడిన పటిష్టమైన బృందాన్ని ప్రకటించింది. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మన్‌ప్రీత్ సింగ్ ఈ మెగాటోర్నీకి ఎంపికయ్యాడు. గోల్ కీపర్లుగా మోహిత్ హెచ్ఎస్, సూరజ్ కర్కేరా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. యువకులు రాజిందర్ సింగ్, ఆదిత్య అర్జున్ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు.

'ఇది పూర్తిగా సమతూకంతో కూడిన స్క్వాడ్. అంతర్జాతీయ అనుభవమున్న ఆటగాళ్లు, ప్రతిభను చాటుకున్న జూనియర్లను తీసుకున్నాం. ఒక్కో మ్యాచ్ గెలవడంపైనే దృష్టి సారిస్తున్నాం. ఇదే దృక్పథంలో వరల్డ్‌కప్ బరిలో దిగుతున్నాం అని ప్రధాన కోచ్ క్రెయిగ్ ఫల్టన్ పేర్కొన్నాడు.

నెదర్లాండ్స్‌లో ఆగస్టు 15 నుంచి 30వ తేదీ వరకూ పురుషుల హాకీ వరల్డ్‌కప్ జరుగనుంది. గ్రూప్ డీలో ఉన్న భారత్ లీగ్ దశలో ఇంగ్లండ్, వేల్స్, పాకిస్థాన్‌తో తలపడనుంది. టోర్నీ ఆరంభం రోజే వేల్స్‌ను టీమిండియా ఢీకొట్టనుంది. ఆగస్టు 17న ఇంగ్లండ్‌తో, చిరకాల ప్రత్యర్థి పాక్‌తో ఆగస్టు 19న హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

హాకీ వరల్డ్‌కప్ స్క్వాడ్ : గోల్ కీపర్స్ -- మోహిత్ హెచ్ఎస్, సూరజ్ కర్కేరా.

డిఫెండర్లు -- జర్మన్‌ప్రీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్(కెప్టెన్), అమిత్ రోహిదాస్, జుగ్‌రాజ్ సింగ్, సంజయ్, సుమిత్, యశ్‌దీప్ సివాచ్.

మిడ్‌ఫీల్డర్స్ -- రాజిందర్ సింగ్, ఆదిత్య అర్జున్ లలాఏ, హార్దిక్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, నీలకంఠ శర్మ, వివేక్ సాగర్ ప్రసాద్.

ఫార్వర్డ్స్ -- దిల్‌ప్రీత్ సింగ్, శిలానంద్ లక్రా, సుఖ్‌జీత్ సింగ్, మన్‌దీప్ సింగ్, అభిషేక్.


## రోహిత్ నన్ను క్షమించు.. అందుకే అప్పుడు నిన్ను నమ్మలే..!



లార్డ్స్ శతకంతో విమర్శకుల చెంప చెళ్లుమనిపించిన రోహిత్ శర్మకు సంజూ శాంసన్ సారీ చెప్పాడు. టీ20 వరల్డ్‌కప్ 2026లో తనకు అవకాశం లభిస్తుందని రోహిత్ చెప్పినా.. తాను నమ్మలేదని శాంసన్ తెలిపాడు. 'స్వదేశంలో ముగిసిన పొట్టి ప్రపంచప్ సమయంలో నేను రోహిత్‌ను నమ్మలేదు. అందుకు ఇప్పుడు సారీ' అని మంగళవారం శాంసన్ పేర్కొన్నాడు. అంతేకాదు మెగా ఈవెంట్‌లో తనను తాను ఆత్మవిమర్శ చేసుకున్న తీరును సంజూ వెల్లడించాడు.స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశలో బెంచ్‌మీదే కూర్చున్న సంజూ శాంసన్.. నాకౌట్‌లో చెలరేగాడు. తనకిచ్చిన అవకాశాన్ని రెండుచేతులా అందిపుచ్చుకొని.. వరసగా అర్ధ శతకాలతో టీమిండియా విజయాల్లో కీలకమయ్యాడు. అయితే.. న్యూజిలాండ్‌పై విఫలమైనందున టోర్నీ ప్రపంచకప్ జరుగుతుండగా 'అసలు నేను తుది జట్టులో ఉంటానా? ఉండనా?' అనే సందేహం అతడిని వెంటాడిందట. అప్పుడు.. రోహిత్ శర్మ అతడితో 'సంజూ.. నీకు పక్కాగా అవకాశం వస్తుంది. దిగులు చెందకు' అని చెప్పాడని శాంసన్ తాజాగా వెల్లడించాడు.నేను నిజాయతీగా చెబుతున్నా.. అప్పుడు రోహిత్‌ను నమ్మలేదు. సారీ. అతడు హృదయపూర్వంగా లేదా తన అనుభవంతో ఆ మాట చెప్పి ఉండవచ్చు. కానీ, ఆరోజు అతడికి నాపై ఉన్న నమ్మకం నాకు లేదు. ఆరోజు నేను అతడి మాటల్ని నమ్మే పరిస్థితిలో లేను. ఎందుకంటే.. న్యూజిలాండ్‌తో పొట్టి సిరీస్ ముగిసినర రెండు రోజులకే వరల్డ్‌కప్ మొదలైంది. దాంతో.. నాకు మెగా టోర్నీకి సిద్ధమయ్యేందుకు దాదాపు వారం పట్టింది. అంటే.. నేను అప్పటికి సిద్ధంగా లేనని నా ముఖంలో 100 శాతం కనిపించేది. ఐదారు రోజులు నేను అదే విధమైన నిరాశలో ఉండిపోయాను. ఆ సమయంలో నాకు నేను ధైరయం చెప్పుకున్నా.నీకు తెలుసా నువ్వు విఫలమయ్యావు. తర్వాత ఏంటీ? నువ్వు అట్టడుగున ఉన్నావు. ఇక్కడి నుంచి పైకి మాత్రమే వెళ్లగలవకు. కాబట్టి.. మానసికంగా సన్నద్ధమవ్వు. నేను క్రికెట్ ఎందుకు ఆడుతున్నాను? నా లక్ష్యం ఏంటీ?.. ఇలా వరల్డ్‌కప్ సమయంలో నన్ను నేను విశ్లేషించుకున్నా. అలా నన్ను నేను ప్రశ్నించుకున్నాక అంతా మారిపోయింది. మళ్లీ ట్రాక్‌లోకి వచ్చాను' అని శాంసన్ వెల్లడించాడు.టీ20 వరల్డ్‌కప్ నాకౌట్‌లో రెచ్చిపోయిన శాంసన్ వెస్టిండీస్‌పై 97 నాటౌట్.. సెమీస్‌లో ఇంగ్లండ్‌పై 89, ఫైనల్లోనూ న్యూజిలాండ్‌పై 46 బంతుల్లో 89 రన్స్ చేశాడు. టీమిండియా మూడోసారి టీ20 వరల్డ్‌కప్ విజేతగా నిలవడంతో.. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఎంపికయ్యాడు శాంససన్.

# స్పోర్ట్స్

## విరాట్ కోహ్లీ సాయం ఎప్పటికి మర్చిపోను



భారత షట్లర్లెవరికీ సాధ్యం కాని జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను పి.వి. సింధు తొలిసారిగా కైవసం చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆమె విజయం వెనుక కఠిన సాధనతో పాటు భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ ఇచ్చిన ఒక సలహా ఆమె జీవితాన్నే మార్చి వేసింది. ఈ టోర్నీకి ముందు సింధు ఫామ్ కోల్పోయి కెరీర్ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఆమె కోహ్లీని సంప్రదించాక సవాళ్లను అధిగమించి విజేతగా నిలిచింది.జీవితంలో ఏది సాధించాలన్నా నమ్మకం అనేది అత్యంత కీలకమైంది. లక్ష్యాన్ని చేరే క్రమంలో దారులన్నీ మూసుకుపోయి తీవ్ర నిరాశలో కొట్టుమిట్లాడుతున్నప్పుడు నిజాయితీతో కూడిన చిన్న మాట సాయమైనా అద్భుతాలు చేసేలా ప్రేరిపిస్తుంది. సరిగ్గా రెండేండ్ల కింద వరకు ఇలాంటి క్లిష్ట పరిస్థితని ఎదుర్కొన్న పి.వి. సింధు స్టార్ క్రికెటర్ కింగ్ కోహ్లీని కలువడంతో అతడిచ్చిన విలువైన సూచనలు తన కెరీర్‌నే మార్చివేసిందని సింధు తెలిపారు. తాను కెరీర్ పరంగా ఫామ్ కోల్లోయి తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న సమయంలో విరాట్ భాయ్‌ని నా భర్త దత్తాతో వెళ్లి కలిశానని తెలిపారు. వెంటనే ఆయన స్పందించాడన్నారు. ఫామ్ కోల్పోయిన సమయంలో సెంచరీ కోసం సుదీర్ఘ నిరీక్షణను ఎలా అధిగమించారని సింధు కోహ్లీని అడగగా.. కింగ్ కోహ్లీ స్పందిస్తూ పరుగులు చేయడమే తన పని అని, అందులోనే ఆనందాన్ని ఆస్వాదించడం ప్రారంభించాను' అని అతడు చెప్పినట్లు ఆమె తెలిపారు. విరాట్ చెప్పిన మాటలు తనపై ప్రభావం చూపాయని ఆతని పాజిటివ్ వైఖరిని బ్యాట్మింటన్‌కు అప్లై చేసుకొని ఫలితాలను సాధించినట్ల చెప్పారు. విరాట్ భాయ్‌కి ఎప్పటికి రుణపడి ఉంటామని పి.వి. సింధు తెలిపారు. కాగా, పారిస్ ఒలింపిక్స్ అనంతరం సింధు ఆటతీరుపై స్పోర్ట్స్ సైన్స్ ఆధారంగా విశ్లేషణ జరిపామని దత్త సాయి తెలిపారు. దూకుడుగా ఆడటం తగ్గించి, అవసరానికి మించి లైన్ కాల్స్‌పై ఆధారపడటం వంటి లోపాలను గుర్తించి వాటిపై ప్రత్యేకంగా పనిచేశామని వివరించారు. కోచ్‌లు, ఫిట్‌నెస్ నిపుణుల సూచనల మేరకు ఆహార నియమాలు కూడా కచ్చితంగా పాటించడం వల్లే టైటిల్ సాధ్యమైందని పేర్కొన్నారు.

# ఓజీ టెలివిజన్ ప్రీమియర్‌కి టైం ఫిక్స్..

## సీక్వెల్‌పై కూడా జోరుగా సాగుతున్న కసరత్తులు..!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దే కాల్ హిమ్ ఓజీ' విడుదలై దాదాపు పది నెలలు గడిచినా.. ఆ సినిమా క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుని పవన్ కెరీర్‌లో మరో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమా మరోసారి వార్తల్లో నిలవడానికి కారణం.. టెలివిజన్ ప్రీమియర్‌తో పాటు సీక్వెల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్. ఇప్పటివరకు ఈ చిత్రం శాటిలైట్ హక్కులపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే తాజాగా ప్రముఖ తెలుగు ఛానెల్ ఈటీవీ ఈ సినిమా టెలివిజన్ హక్కులను సొంతం చేసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది.ఇప్పటికే ఛానెల్‌లో ప్రత్యేక ప్రోమోలు ప్రసారం అవుతుండగా.. ఆగస్టులో వచ్చే ఓ ప్రముఖ పండుగ సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ప్రసారం చేయనున్నట్లు సమాచారం. దీంతో బుల్లితెరపై 'ఓజీ'ని చూడాలని ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఇక అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగించే వార్త ఏమిటంటే.. 'ఓజీ 2' తెరకెక్కించే దిశగా అధికారిక చర్చలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ సీక్వెల్‌ను రూపొందించాలనే ఆసక్తిని స్వయంగా పవన్ కళ్యాణ్ వ్యక్తం చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం ముగిసిన తీరు కూడా రెండో భాగానికి మంచి అవకాశాన్ని కల్పించడంతో, కథ అభివృద్ధిపై ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని సమాచారం. ఈసారి సీక్వెల్‌ను పవన్ కళ్యాణ్ తన సొంత నిర్మాణ సంస్థ 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' బ్యానర్‌పై నిర్మించనున్నట్లు సమాచారం. దర్శకుడు సుజీత్ మరోసారి మెగా ఫోన్ పట్టనుండగా.. సంగీత దర్శకుడు ఎస్. థమన్ కూడా సీక్వెల్‌కు సంగీతం అందించనున్నట్లు తెలుస్తోంది. మొదటి భాగానికి ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రాజెక్ట్ ప్రాథమిక చర్చల దశలో ఉండగా.. కథ, నటీనటులు, షూటింగ్ షెడ్యూల్ తదితర అంశాలపై చిత్రబృందం త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. 'ఓజీ' విజయంతో భారీ అంచనాలు ఏర్పడిన నేపథ్యంలో, రెండో భాగాన్ని మరింత గ్రాండ్‌గా తెరకెక్కించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# 'సింహాద్రి'లో ఆ సీన్ కోసం ఇంట్లోనే యుద్ధం జరిగింది..

## -గ్లోబల్ వేదికపై రాజమౌళి ఆసక్తికర వ్యాఖ్యలు



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత గుర్తింపు పొందిన భారతీయ దర్శకుల్లో ఒకరిగా నిలిచారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు మహేష్ బాబు హీరోగా తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ వారణాసి తో మరోసారి ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి నెలకొనగా, విదేశాల్లో నిర్వహిస్తున్న ప్రమోషనల్ ఈవెంట్లలో రాజమౌళి చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన ఓ ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న రాజమౌళి.. సినిమా నిర్మాణంలో ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడారు. ముఖ్యంగా దర్శకుడిగా తాను తీసుకునే కొన్ని నిర్ణయాల విషయంలో తన కుటుంబ సభ్యులు, చిత్రబృందంతో విభేదాలు కూడా వస్తాయని ఆయన వెల్లడించారు.అలాంటి సందర్భానికి ఉదాహరణగా జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కించిన 'సింహాద్రి' చిత్రంలోని ఓ కీలక సన్నివేశాన్ని రాజమౌళి ప్రస్తావించారు. రాజమౌళి మాట్లాడుతూ.. 'సింహాద్రి' సినిమాలో హీరో ఒక మంచి వ్యక్తిని చంపాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. సాధారణంగా హీరో చేత అలాంటి పని చేయించడం ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారనే సందేహాలు తన కుటుంబ సభ్యులు, టీమ్‌లో చాలామందికి ఉన్నాయని చెప్పారు. అయితే కథలో ఆ సంఘటన వెనుక బలమైన కారణం ఉందని, ఆ మంచి వ్యక్తిని హీరో చంపకపోతే వేలాది మంది అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని ఆయన వివరించారు. ఆ భావోద్వేగాన్ని ప్రేక్షకులకు బలంగా చేరవేయగలిగితేనే ఆ సన్నివేశం పనిచేస్తుందని తాను నమ్మానని రాజమౌళి వెల్లడించారు. ఆ సన్నివేశాన్ని ఉంచాలా? తొలగించాలా? అనే అంశంపై కుటుంబ సభ్యులు, చిత్రబృందంతో చిన్నపాటి వాదనలు జరిగాయని రాజమౌళి చెప్పారు. చివరికి కథలోని ఎమోషన్‌ను మరింత బలంగా తెరకెక్కించడంతో ఆ సీన్ ప్రేక్షకులను కదిలించిందని, సినిమా విజయానికి కూడా అది కీలకంగా మారిందని తెలిపారు. దర్శకుడిగా కొన్ని సందర్భాల్లో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని, కథ చెప్పే విధానంపై నమ్మకం ఉంటే అలాంటి రిస్క్‌లు తీసుకోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. గ్లోబల్ వేదికపై రాజమౌళి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# అర్థం చేసుకోకుండా కామెంట్స్ చేస్తారు..

## నెట్టింట నెగెటివిటీపై రకుల్ ప్రీత్ సింగ్



తెలుగు, తమిళం, హిందీ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ రకుల్ ప్రీత్ సింగ్. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ భామ అప్పడప్పుడు నెటిజన్లు, అభిమానులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ గురించి మాట్లాడింది. సోషల్ మీడియా అనేది కొందరు జనాలు ముక్కుమొఖం తెలియని అకౌంట్లతో తరచూ కఠిన వ్యాఖ్యలు చేస్తూ నెగెటివిటీని ప్రచారం చేసే హబ్‌లాంటిది. చాలా మంది వ్యక్తులు అజ్ఞాత ప్రొఫైల్స్‌తో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. వారు చేస్తున్నకామెంట్ల ప్రభావం ఎలా ఉంటుందో కనీసం అర్థం చేసుకోరని చెప్పింది. అందరినీ మెప్పించడం అసాధ్యమన్న రకుల్ ప్రీత్ సింగ్ సెలబ్రిటీలు ఆన్‌లైన్‌లో వచ్చే అనవసరమైన ట్రోల్స్, విమర్శల వల్ల తమ ఫోకస్ మార్చుకోకూడదు. నెగెటివిటీని ఎదుర్కొనేందుకు వాటిని పట్టించుకోకుండా వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలపైన దృష్టి పెట్టడమే ఉత్తమ మార్గమనని చెప్పుకొచ్చింది. ఇండియన్ 2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ నటిస్తోన్న రామాయణలో కీలక పాత్రలో నటిస్తోంది. రకుల్ నటించిన Pati Patni Aur Woh Do ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఈ భామ నెక్స్ట్ ఇండియన్ 3 చేయాల్సి ఉంది. మరి తెలుగు సినిమాలో ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.


# నెగెటివ్ రోల్‌లో ఐశ్వర్య?





వైవిధ్యమైన కథాంశాల్ని ఎంచుకుంటూ దక్షిణాదిలో ప్రతిభావంతురాలైన కథానాయికల్లో ఒకరిగా పేరు తెచ్చుకుంది ఐశ్వర్యరాజేష్. అయితే ఈ భామకు తెలుగులో మాత్రం కాస్త ఆలస్యంగానే బ్రేక్ దొరికింది. గత ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో తెలుగులో ఆమె తొలి బ్లాక్‌బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం తమిళ, కన్నడ సినిమాలో బిజీగా ఉన్న ఈ అమ్మడు తెలుగులో ఓ బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర కథానాయకుడు బాలకృష్ణ-కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా ప్రకటన రోజు నుంచి వార్తల్లో నిలుస్తున్నది.గాడ్ ఆఫ్ మాసెస్‌గా అభిమానులు పిలుచుకునే బాలకృష్ణ.. సామాజిక అంశాల మేళవింపుతో మాస్ కథాంశాల్ని తెరకెక్కించడంలో సిద్ధహస్తుడైన దర్శకుడు కొరటాల శివ కలయిక వెండితెరపై సంచలనాల్ని సృష్టించడం ఖాయమని అభిమానులు ధీమాగా ఉన్నారు. త్వరలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఇందులో ఐశ్వర్యరాజేష్ ఓ కీలక పాత్రకు ఎంపికైందని తెలిసింది. నెగెటివ్ షేడ్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని, కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# అడ్వాన్స్‌డ్ బుకింగ్‌లో అదరగొడుతున్న 'అవెంజర్స్'




హాలీవుడ్ సినిమా అవెంజర్స్: డూమ్స్‌డే డిసెంబర్‌లో విడుదల కానున్నది. కానీ దీనికి సంబంధించిన ఓ వార్త గ్లోబల్‌గా హాట్ టాపిక్‌గా నిలిచింది. అదేమంటే ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్‌ను జూలై 20 నుంచి ప్రారంభించారు. ఈ అడ్వాన్స్ బుకింగ్ కేవలం 12 గంటల్లో 10 మిలియన్ డాలర్లు (రూ. 100 కోట్లు) వసూలు చేసి రికార్డు సృష్టించింది. మార్వెల్ స్టూడియో నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ కూడా సోమవారమే రిలీజ్ అయ్యింది.డిస్నీ సంస్థ కొత్తగా ప్రారంభించిన లార్జ్ స్క్రీన్ ఫార్మాట్ ఇన్ఫినిటీ విజన్‌లో మాత్రమే ఈ అడ్వాన్స్ బుకింగ్స్ మొదలు పెట్టారు. అమెరికా వ్యాప్తంగా 10 శాతం థియేటర్లలో ఈ ఫార్మాట్‌ను ఏర్పాటు చేశారు. ఐమ్యాక్స్ స్క్రీన్లకు పోటీగా డిస్నీ ప్రారంభించిన ఈ ప్రత్యేక ఫార్మాట్ సినీ అభిమానులకు బాగా నచ్చింది. ఈ సినిమాకు మరో ప్రత్యేక ఏమిటంటే జూనియర్ రాబర్ట్ డౌనీ రీ ఎంట్రీ ఇస్తున్నాడు. దీనిలో డాక్టర్ డూమ్స్ పాత్ర పోషిస్తున్నాడు. అలాగే ఈ సినిమాలో క్రిస్ ఎవాన్స్, క్రిస్ హెమ్స్‌వర్త్, పెడ్రో పాస్కల్, ఆంటోని మ్యాకీ, పాల్ రడ్ వంటి సూపర్ స్టార్లు నటిస్తున్నారు.

అదేవిధంగా అవెంజర్స్: ఇన్ఫినిటీవార్, అవెంజర్స్: ఎండ్‌గేమ్ చిత్రాలను డైరెక్ట్ చేసిన రూసో బ్రదర్స్ ఆంథోని, జో మళ్లీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇప్పటివరకు మిశ్రమ ఫలితాలు ఎదుర్కొంటున్న మార్వెల్ స్టూడియో ఈ సినిమాతో హిట్ కొట్టాలని చూస్తుంది. ఈ సంస్థ నిర్మించిన డెడ్‌పూల్ అండ్ వోల్వరైన్, గార్డియన్ ఆఫ్ ది గెలాక్సీ-3, స్పైడర్ మ్యాన్: నో వే హోమ్ సినిమాలు ఆశించినంతగా విజయం సాధించలేదు. అయితే ఈ సినిమా డిసెంబర్ 18న విడుదల కానుండగా, అదే నెలలో డ్యూన్-3 విడుదలవుతుంది. ఏ సినిమా హిట్‌గా నిలుస్తుందో వేచి చూడాలి.



Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465